


epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

TELANGANA RISING
CURE - PURE - RARE

సంపుటి : 19 సంచిక : 39 | 18-04-2026 శనివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00




## 30 లక్షలకు పైగా ధాన్యం సేకరణ చేపట్టండి

### కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వినతి

2025-26 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ ధ్యానం సేకరించాలని కేంద్రమంత్రికి సిఎం రేవంత్, మంతంరి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. అలాగే యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వివరించారు. ఈ ధాన్యం మొత్తం కొనుగోలు చేసి తెలంగాణ రైతాంగానికి అండగా నిలవాలని కోరారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు.

వార్త 2లో



## వీగిన మహిళా రిజర్వేషన్ బిల్లు

- 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు దక్కని ఆమోదం
- అనుకూలంగా 278..వ్యతిరేకంగా 211 ఓట్లు
- రాజ్యాంగ సవరణకు అవసరమైన మద్దతు కరవు
- ఐక్యతను చాటుకున్న విపక్ష ఇండి కూటమి
- ప్రధాని మోడీ పిలుపు నిష్ఫలం

మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో సుదర్ఘ చర్చ అనంతరం బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మొడొంతుల మెజార్టీని సాధించలేకపోయింది. ఈ బిల్లుతో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. బిల్లుకు అనుకూలంగా 278, వ్యతిరేకంగా 211 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓటింగ్‌లో 489 మంది పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు సవరణ బిల్లు అవసరమైన మెజారిటీ సాధించలేకపోయింది.

వార్త 3లో





### కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణ

కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అనీ. పరిచిత్ మెహ్రా ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది. ఇంజినీర్లు, నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది.

2

## కాళేశ్వరంపై ఎలాంటి దురుద్దేశ్యం లేదు

- నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ జైన్‌తో చర్చించాం
- వానాకాలం లోగానే సాయిల్ టెస్టింగ్ పూర్తి
- 20న సిఎం రేవంత్ మేడిగడ్డను పరిశీలిస్తారు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి, తమ ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు, పునరుద్ధరణపై చర్చించామని తెలిపారు.



వార్త 2లో



2

### శాస్త్రిపురం ఫ్లై ఓవర్ ప్రారంభం



2

### సిగాచీ బాధితులను నట్టేట ముంచారు

### రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా మరోమారు హరివంశ్



**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

: రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ ఎన్నికయ్యారు. ప్రతిపక్ష అభ్యర్థులు ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఆయన ఉపసభాపతి బాధ్యతలు చేపట్టడం ఇది మూడోసారి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ డిప్యూటీ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అనుభవం రాజ్యసభకు ఎంతో అవసరమని అన్నారు. ఆయన అందరినీ కలుపుకుని వెళ్లాలని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. హరివంశ్ నేతృత్వంలో సభ మరింత శక్తిమంతం అవుతుందని అన్నారు. రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా నూతన ఉపసభాపతికి శుభాకాంక్షలు తెలిపారు.



### మరింత పెరిగిన బంగారం ధర

భారత్‌లో బంగారం ధరలు గత మూడు రోజులుగా ఎంతో కొంత పెరుగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ అనిశ్చితులు తగ్గుతాయన్న సంకేతాలతో పాటు అక్షయ తృతీయ సమీపిస్తున్న తరుణంలో పసిడికి డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది.

2



2

### తేజస్వీ సూర్య మాటల్లో తప్పేముంది

తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాటలను కాంగ్రెస్ నేతలు ఎందుకు తప్పుబడుతున్నారంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు.



2

### రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా

దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గకుండా డీలిమిటేషన్ పక్రియ జరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కొత్త నాయకత్వానికి అవకాశం వస్తుందని ప్రతిపక్షాలు డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్ల పెంపు నిర్ణయం తీసుకుంటే.. తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారు.

# 30 లక్షలకు పైగా ధాన్యం సేకరణ చేపట్టండి

## కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వినతి





న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

2025-26 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ ధ్యానం సేకరించాలని కేంద్రమంత్రికి సిఎం రేవంత్, మంతంరి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. అలాగే యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వివరించారు. ఈ ధాన్యం మొత్తం కొనుగోలు చేసి తెలంగాణ రైతాంగానికి అండగా నిలవాలని కోరారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు, ఇతర అంశాలపై చర్చించారు. కేంద్ర మంత్రితో భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..'దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో వరిధాన్యం ఉత్పత్తి జరుగుతోంది. ఈ రబీ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయబోతున్నాం. వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసిన 48 గంటల్లోనే మద్దతు ధర డబ్బులు వారి ఖాతాల్లో వేస్తున్నాం. ఈ రబీ సీజన్‌లో 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా తీసుకోవాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశాం. కేంద్రం నుంచి తెలంగాణకు రూ.1,400 కోట్లు రావాల్సి ఉంది. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆ నిధులను విడుదల చేయాలని కోరాం. కేంద్రం పోషకాహార పంపిణీ పథకాన్ని రద్దు చేసింది. ఇది సరైన విధానం కాదు' అని తెలిపారు. ఢిల్లీలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పర్యటన బిజీబిజీగా సాగుతోంది. డీలిమిటేషన్‌పై హైబ్రిడ్ మోడల్‌కు మద్దతు కూడగట్టేందుకు ఆయన ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు దక్షిణాది రాష్ట్రాల వాదనను జాతీయస్థాయిలో వినిపించేందుకు కృషి చేస్తున్నారు. ప్రోరేటాకు వ్యతిరేకంగా దక్షిణాది ముఖ్యమంత్రులను రేవంత్ సమన్వయం చేస్తున్నారు. అదే సమయంలో పలువురు కేంద్రమంత్రులను రేవంత్ రెడ్డి కలుస్తున్నారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, పథకాలపై చర్చిస్తున్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణ

### బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అనీ. పరిచిత్ మెహ్రా ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది. ఇంజినీర్లు, నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. మూడు బ్యారేజీల మరమ్మతులకు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్ పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రుతుపవనాలకు ముందే జియో టెక్నికల్ పరిశీలనలు పూర్తి చేయాలని తెలంగాణ సర్కార్ సూచించింది. మే 30వ తేదీలోగా పరిశీలనలు పూర్తిచేయాలని డెడ్‌లైన్ విధించింది. రోజువారీ పురోగతి నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. సీడబ్ల్యూసీ ఎన్డీఎస్ఏ అనుమతులతో పనులు, డిజైనింగ్ పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. రోజువారీ యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.

## మరింత పెరిగిన బంగారం ధర

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

భారత్‌లో బంగారం ధరలు గత మూడు రోజులుగా ఎంతో కొంత పెరుగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ అనిశ్చితులు తగ్గుతాయన్న సంకేతాలతో పాటు అక్షయ తృతీయ సమీపిస్తున్న తరుణంలో పసిడికి డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. గత మూడు రోజుల్లో పసిడి ధరలు సుమారు రూ.3 వేల మేర పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ కథనం ప్రకారం, ఉదయం 6.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,580గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,42,610గా ఉంది. వెండి ధర దాదాపుగా స్థిరంగానే ఉంది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,74,900ల వద్ద కొనసాగుతోంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,56,670గా ఉంది. ముంబైలో రూ.1,55,580 వద్ద, న్యూఢిల్లీలో రూ.1,55,730 వద్ద కదలాడుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ పసిడి ధర చెన్నైలో రూ.1,43,610గా, ముంబైలో రూ.1,42,610గా, న్యూఢిల్లీలో రూ.1,42,760గా ఉంది. దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో వెండి ధరలు రూ.2.69 లక్షల నుంచి రూ.2.74 లక్షల వరకూ ఉన్నాయి. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్స్ (31.10 గ్రాములు) 24 క్యారెట్ల పసిడి ధర 4,787 డాలర్ల వద్ద, ఔన్స్ వెండి ధర 78 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## కాళేశ్వరంపై ఎలాంటి దురుద్దేశ్యం లేదు

### నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ జైన్‌తో చర్చించాం

### వానాకాలం లోగానే సాయిల్ టెస్టింగ్ పూర్తి

### 20న సిఎం రేవంత్ మేడిగడ్డను పరిశీలిస్తారు

### నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి



కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి, తమ ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు, పునరుద్ధరణపై చర్చించామని తెలిపారు. గోదావరి వరదలు వచ్చేలోగా సాయిల్ టెస్టింగ్, డిజైన్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై కేసీఆర్ హయాంలో చేసిన పొరపాటు తెలంగాణ ప్రజలకు తెలుసునని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరాన్ని నిర్మించారని, అది కూలిపోయిందని అన్నారు. కాళేశ్వరంపై దాదాపు రూ.97 వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఆ ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు. కాళేశ్వరంపై ప్రతి ఏడాది రూ.10వేల కోట్ల వడ్డీ కడుతున్నామని తెలిపారు. ప్రజాధనం ఉపయోగించడంతోనే దాన్ని ఎలా రిపేర్ చేయాలో ఆలోచించి ముందుకు వెళు తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని అన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ డ్యామేజ్ సాయిల్ టెస్ట్, డిజైన్ల ఖర్చులను కాంట్రాక్ట్ సంస్థలే భరిస్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## శాస్త్రిపురం ఫ్లై ఓవర్ ప్రారంభం

### ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి



హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలక అడుగుపడింది. నగరంలో మరో ఆర్‌వోబీ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం శాస్త్రిపురం రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌ను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ 71 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. సుమారు 490 మీటర్ల పొడవుతో, నాలుగు లైన్లలో ఫ్లై ఓవర్ జీహెచ్ఎంసీ నిర్మించింది. జీహెచ్ఎంసీ, సౌత్ సెంట్రల్ రైల్వేల సమన్వయంతో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. శాస్త్రిపురం ఫ్లై ఓవర్ అందుబాటులోకి రావడంతో మైలార్ దేవ్‌పల్లి నుంచి ఫలక్‌నుమా మార్గంలో ప్రయాణం సులభతరం అయింది. ఉద్దమ్‌గడ్డ రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఏర్పడే ట్రాఫిక్ జామ్‌కు చెక్ పడనుంది. ప్రయాణ సమయం కూడా చాలా వరకు తగ్గనుంది. ఈ ÷÷–లఓల్గ÷వర్ ద్వారా మైలార్‌దేవ్‌పల్లి, వట్టెపల్లి, ఫలక్‌నుమా, ఆర్టీసీ బస్ డిపో ప్రాంతాల మధ్య కనెక్టివిటీ మెరుగుపడింది.

## సిగాచీ బాధితులను నట్టేట ముంచారు

### కోటి పరిహారం హామీ ఇచ్చి మరచిన సిఎం

### మరోమారు మండిపడ్డ హరీష్ రావు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

సిగాచి ప్రమాద బాధితులకు ఇచ్చిన హామీని కూడా నిలుపుకోలేక తన అసమర్థతను సీఎం రేవంత్ రెడ్డి మరోసారి చాటుకున్నారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. నాడు కోటి రూపాయల సాయం అంటూ సిగాచి బాధితులను నమ్మబలికి అందులో సగం కూడా వారికి చేర్చని రేవంత్ రెడ్డి నయవంచనలో తనను మించినవారు లేరని నిరూపించుకున్నారని అన్నారు. ఆ పూటకు మాటలు చెప్పడం.. ఆ తర్వాత తాను చెప్పిన మాటలకే విలువ ఇవ్వకపోవడం రేవంత్ రెడ్డికే చెల్లిందని విమర్శించారు. సిగాచి పరిశ్రమ అగ్నిప్రమాదంలో 54 మంది అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోతే, ఆ బాధితుల కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు వివేక్, దామోదర రాజనర్సింహ.. మృతదేహాల సాక్షిగా ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించారని తెలిపారు. కానీ ఇదంతా కంటితుడుపు చర్యే అని, బాధితులకు జరిగిన న్యాయం శూన్యమని ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంతో తేటతెల్లమైందని పేర్కొన్నారు. యాజమాన్యం, ప్రభుత్వం కుమ్మక్కై పరిహారం లెక్కల్లో చేస్తున్న మోసం అంతా ఇంతా కాదని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం అసెంబ్లీలో సమర్పించిన అధికారిక లెక్కల ప్రకారం, 54 మంది బాధితులకు కలిపి ఇప్పటివరకు చెల్లించిన రూ. 24.51 కోట్లను విభజించి చూస్తే, ఒక్కో కార్మికుడి కుటుంబానికి సగటున అందిన పరిహారం కేవలం రూ. 45.40 లక్షలు మాత్రమే అని తెలిపారు. అంటే ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన కోటి రూపాయల పరిహారంలో ఇంకా ఒక్కో కుటుంబానికి దాదాపు రూ. 54.60 లక్షల చొప్పున, మొత్తంగా రూ. 29.48 కోట్ల బకాయిని ఈ ప్రభుత్వం ఎగ్గొట్టి బాధితులను నట్టేట ముంచిందని మండిపడ్డారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ పేద బాధిత కుటుంబాలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఇక్కడ మరో మోసం దాగుందని విమర్శించారు. యాజమాన్యం తాము 40 నుంచి 42 లక్షలు ఇస్తున్నామని కోర్టుల ముందు ఒప్పుకుందని చెప్పారు. అసలు నిజమేంటంటే, వారు సొంతంగా ఇచ్చిన 25 లక్షలకు.. కార్మికులు చనిపోవడం వల్ల చట్టబద్ధంగా వారికి రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులను కూడా కలుపుకుని ఈ లెక్కలు చూపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, యాజమాన్య అమానవీయతకు, దిగజారుడుతనానికి పరాకాష్ట అని మండిపడ్డారు. అంతేకాదు, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన కార్మికుల వైద్య ఖర్చులను కూడా ఈ అరకొర పరిహారంలోనే కోత విధించడం దారుణమని అన్నారు. ఇక ప్రమాదంలో కాలి బూడిదై ఆచూకీ దొరకని 8 మంది కార్మికుల కుటుంబాలను డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పించుకున్న దుర్మార్గ ప్రభుత్వం ఇది అని విమర్శించారు. ఇది కేవలం ఒక ప్రమాదం కాదు, యాజమాన్యం నిర్లక్ష్యంతో జరిగిన సామూహిక హత్య అని హరీశ్‌రావు అన్నారు. ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాలు గాలికొదిలేశారని విచారణలో ఆధారాలతో సహా స్పష్టంగా తేలిందని చెప్పారు. బాధితుల పక్షాన హైకోర్టులో కేసు వేసి, న్యాయస్థానం మొట్టికాయలు వేస్తే తప్ప పోలీసులు కదలలేదని హరీశ్‌రావు తెలిపారు. తూతూ మంత్రంగా ఎండీని అరెస్టు చేయడం, వెంటనే ఆయన బెయిల్ మీద బయటకు వచ్చేలా పరోక్షంగా సహకరించడం చూస్తుంటే.. ప్రభుత్వానికి, కంపెనీ యాజమాన్యానికి మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాలు ఏమిటో అర్థం అవుతూనే ఉందన్నారు. ఆనాడు మృతదేహాల సాక్షిగా ఇచ్చిన మాట ప్రకారం, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులతో సంబంధం లేకుండా ప్రతి బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## తేజస్వీ సూర్య మాటల్లో తప్పేముంది

### మంత్రి పొన్నం వ్యాఖ్యలపై బండి మండిపాటు

న్యూఢిల్లీ,

తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాటలను కాంగ్రెస్ నేతలు ఎందుకు తప్పుబడుతున్నారంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. రాష్ట విభజన సమయంలో కాంగ్రెస్ తప్పిదాలతో పలువురు యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని ఎంపీ తేజస్వి సూర్య చెప్పారని తెలిపారు. 2009లో కాంగ్రెస్ తెలంగాణ ఏర్పాటుకు సహకరించి మళ్లీ వెన్నక్కి తగ్గారని.. దీని గురించే తేజస్వి సూర్య మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి గతంలో సోనియాగాంధీని బలిదేవత అన్నారన్న విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అంటూ విమర్శించారు. అలాంటి రేవంత్ కుఏబినేట్‌లో ఉన్న పొన్నం తదితరులు గతాన్ని మరిచి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో రణభేరి కార్యక్రమానికి రేవంత్ రెడ్డి తుపాకీ పట్టుకొని వెళ్లారని కేంద్ర మంత్రి తెలిపారు. 1400 మంది బలిదానాలకు హత్యలకు కారణమైన పార్టీ కాంగ్రెస్ అని ఆరోపించారు. ఒక్క ఓటు, రెండు రాష్ట్రాలు అనే నినాదానికి కట్టుబడి, రాష్ట్ర విభజనకు మద్దతు ఇచ్చింది బీజేపీ అని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ కావాలని అడ్డుకుంటోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ అవినీతి గురించి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు.

## రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా

### ఉత్తరాది, దక్షిణ్యాది పేరుతో విషం చిమ్ముతున్నారు

### కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి

న్యూఢిలీ, అక్షరకలం ప్రతినిధి

దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గకుండా డీలిమిటేషన్ పక్రియ జరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కొత్త నాయకత్వానికి అవకాశం వస్తుందని ప్రతిపక్షాలు డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్ల పెంపు నిర్ణయం తీసుకుంటే.. తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని మండిపడ్డారు. మహిళల రిజర్వేషన్లకు ఎంఐఎం వ్యతిరేకం. ఈ అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను కలిపింది ఎంఐఎం పార్టీయే. సీఎం రేవంత్‌రెడ్డిది హైబ్రిడ్ ఫార్ములా కాదు.. అది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. విపక్షాలు రాజకీయ దురుద్దేశంతో, ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నాయని ఆయన మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును అడ్డుకోవాలనే తప్పుడు ఆలోచనతో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ అపోహలు సృష్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రతిపక్షాలు పార్లమెంట్ సాక్షిగా పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం వారి రాజకీయ ప్రయోజనాల కోసమేనని ధ్వజమెత్తారు. దక్షిణ భారతదేశానికి న్యాయం చెయ్యడమే మోదీ ఫార్ములా. న్యాయమా, అన్యాయమా అనే దానిపై చర్చకు సిద్ధమా? అసదుద్దీన్ హైబ్రిడ్ ఫార్ములా ఇది, రేవంత్ రెడ్డి ఫార్ములా కాదు. మజ్లిస్ పార్టీ మహిళ రిజర్వేషన్లకు వ్యతిరేకం. ఈ పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను కలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీకి లొంగిపోయి పనిచేస్తోంది. 360 మంది తెలంగాణ ఉద్యమకారులను అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపింది. తెలంగాణ చివరి దశ ఉద్యమంలో 1200 మంది ఆత్మ బలిదానం చేసుకున్నారు. పార్లమెంట్లో బిల్లు పెట్టినప్పుడు కాంగ్రెస్ ఎంపీలే కారం పొట్లాలు, పెప్పర్ స్ప్రేలు కొట్టారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన తన వ్యాఖ్యలు తప్పు అయ్యాయని ఒప్పుకున్నారు. మహిళ రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపు బిల్లును అడ్డుకునేవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారు. దక్షిణాది రాష్ట్రాలకు నరేంద్ర మోదీ న్యాయం చేస్తున్నారని అన్నారు.

## తేజస్వీ వ్యాఖ్యలను తొలగించేలా చేయండి

### కిషన్ రెడ్డిని కోరిన మంత్రి పొన్నం

### లోక్‌సభలో మాట్లాడిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోలేం

### మంత్రి పొన్నం లేఖపై డిజిపి శివధర్ రెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్,

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అవమానించే విధంగా భాజపా ఎంపీ తేజస్వీ సూర్య పార్లమెంట్‌లో మాట్లాడారని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. తెలంగాణ ఏర్పాటును భారత్–పాకిస్థాన్ విభజనతో పోల్చడం సరికాదన్నారు. తేజస్వీ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఇందుకు లోక్‌సభ స్పీకర్‌ను ఒప్పించాలని ఆయన కోరారు. ఎంపీ విషయంలో చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డికి మంత్రి లేఖ రాశారు. ఈ లేఖపై డీజీపీ స్పందించారు. చట్టసభల్లో మాట్లాడిన అంశాలపై చర్యలు తీసుకునే అధికారం పోలీసులకు ఉండదని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా తేజస్వి మాట్లాడుతుంటే బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు మౌనంగా ఉన్నారని మంత్రి మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును భారత్–పాకిస్తాన్ విభజనతో పోల్చడం సరికాదన్నారు. ఎంపీపై చర్యలు తీసుకోవాలని డీజీపీ శివధర్‌రెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్‌పై చర్చలో ఎంపీ తేజస్వి సూర్య పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజనను ప్రస్తావిస్తూ.. బ్రిటీష్ వాళు చేసిన భారత్– పాకిస్తాన్ విభజనకంటే దారుణంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరే చేశారంటూ ఎంపీ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి.

## రొటేషన్‌లో మహిళలకు ప్రధాని పదవి

### కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ సూచన

న్యూఢిలీ మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్‌పై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ లోక్‌సభలో మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 2002లో డీలిమిటేషన్ చేశారు. ప్రస్తుతం మనం 2026లో ఉన్నాం. ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన చేస్తామంటున్నారు. 15 ఏళ్లు గడిచిపోయింది. దీనిపై ప్రజలకు ఎలా న్యాయం చేస్తారు. మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు. కానీ, ఈ అంశాన్ని డీలిమిటేషన్‌తో లింక్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం.

## మరోసారి మానవత్వం చాటిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

అక్షర కలం, చౌటుప్పల్



చౌటుప్పల్ పంతంగి గ్రామ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోయ అరవింద్ కు 15 రోజుల క్రితం కిడ్నీ, లివర్ ఇన్ఫెక్షన్ తో కోమాలోకి వెళ్లిన అరవింద్ ని మెరుగైన చికిత్స కోసం అపోలో జూబ్లీహిల్స్ హాస్పిటల్ లో చేర్పించడం జరిగింది.ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తే వెంటనే స్పందించి హాస్పిటల్ డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం చేయాలనీ కోరడం జరిగింది.మెరుగైన వైద్యం అందుకుని15 రోజుల తర్వాత ప్రాణాలతో బయటపడ్డాడు కానీ డిశ్చార్జ్ చేసే సమయంలో ఆర్థిక ఇబ్బంది కలగడంతో గ్రామ కాంగ్రెస్ నాయకుల అభ్యర్తన మేరకు మన ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది.వెంటనే స్పందించి 2 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేసి మరో సారి మానవత్వాన్ని చాటుకున్నాడు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.

## 9 ఏళ్ల బాలికను కాపాడిని ముగ్గురు

### వారిని పిలిచి సన్మానించిన కమిషనర్

### ప్రజా చైతన్యంతోనే పోలీసింగ్ పటిష్టం

### ప్రజలు అప్రమత్‌ంగా ఉండాలన్న సజ్జన్నార్

హైదరాబాద్,

తొమ్మిదేళ్ల బాలికను కాపాడిన ముగ్గురు సామాన్య పౌరులను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రశంసించారు. చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న కామాంధుడిని ప్రాణాలకు తెగించి పట్టుకున్న సెజల్, గణపతి, కాశీనాథ్‌లను సీపీ సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు. బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీపీ సజ్జనార్ ఈ ముగ్గురును శాలువాలతో సన్మానించి, ప్రశంసా పత్రాలతో పాటు నగదు రివార్డును అందజేశారు. 'వీరి సాహసం సమాజానికి ఒక గొప్ప సందేశమని ప్రశంసించారు. మహిళలు, చిన్నారుల రక్షణలో పౌరులు ఇలాగే అప్రమత్తంగా ఉంటే నేరాలను అరికట్టవచ్చని వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరూ 'ప్రజా పోలీస్'గా మారాలని సీపీ సజ్జనార్ సూచించారు. ఈ సందర్భంగా గతంలో గోల్కొండలో ఎనిమిదేళ్ల బాలికను కాపాడిన మహ్మద్ ఫిరోజ్ ఉదంతాన్ని కూడా సీపీ సజ్జనార్ గుర్తు చేశారు. ప్రజల చైతన్యమే నేర నియంత్రణలో పోలీసులకు కొండంత





అండ అని అభిప్రాయపడ్డారు. సమాజంలో ఏవైనా అనుమానాస్పద ఘటనలు లేదా నేరాలు జరుగుతున్నప్పుడు భయపడకుండా ఈ మార్గాల ద్వారా పోలీసులను సంప్రదించాలని సీపీ సజ్జనార్ సూచించారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100 లేదా హైదరాబాద్ పోలీస్ వాట్సాప్ నంబర్ 94906 16555లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, జూబ్లీహిల్స్ ఎస్ఐ సోమ శేఖర్ తదితరులు పాల్గొని సాహస యువతను అభినందించారు. ఈ నెల 14వ తేదీన సెజల్ తన స్నేహితుడు గణపతితో కలిసి యూసుఫ్‌గూడ నుంచి మాదాపూర్ వైపు బైక్‌పై వెళ్తుండగా, జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ - 10 సమీపంలో ఓ హృదయ విదారక దృశ్యాన్ని గమనించారు. ఓ వ్యక్తి చిన్నారితో అత్యంత అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఆ బాలిక కళ్లలో కనిపించిన భయం సెజల్, గణపతిలను కదిలించింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వారు నిందితుడిని అడ్డుకున్నారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న కాశీనాథ్, నారాయణలు కూడా తోడవడంతో నిందితుడు తప్పించుకోలేకపోయాడు. వెంటనే డయల్ 100కు కాల్ చేసి నిందితుడిని పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో నిందితుడు యూసఫ్‌గూడకు చెందిన జావీద్ అని గుర్తించారు. బాలిక తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన సమయాన్ని ఆసరాగా చేసుకున్న నిందితుడు, ఐస్‌క్రీమ్ కొనిస్తానని ఆ



చిన్నారిని బైక్‌పై తీసుకెళ్లాడు. నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు గురిచేశాడు. నిందితుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# వీగిన మహిళా రిజర్వేషన్ బిల్లు

### 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు దక్కని ఆమోదం

### అనుకూలంగా 278..వ్యతిరేకంగా 211 ఓట్లు

### రాజ్యాంగ సవరణకు అవసరమైన మద్దతు కరవు

### ఐక్యతను చాటుకున్న విపక్ష ఇండి కూటమి

### ప్రధాని మోడీ పిలుపు నిష్ఫలం

న్యూఢిల్లీ, అక్షర కలం,

మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో సుదర్ఘ చర్చ అనంతరం బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మొడొంతుల మెజార్టీని సాధించలేకపోయింది. ఈ బిల్లుతో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. బిల్లుకు అనుకూలంగా 278, వ్యతిరేకంగా 211 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓటింగ్‌లో 489 మంది పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు సవరణ బిల్లు అవసరమైన మెజారిటీ సాధించలేకపోయింది. దీనిపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన ఓటింగ్ ప్రక్రియలో మొత్తం 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 230 మంది ఓటేశారు. దీంతో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమైన 326 ఓట్లను ఎన్డీఏ సాధించలేకపోయింది. దీంతో మిగతా రెండు బిల్లులను వెనక్కి తీసుకుంటు న్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ప్రధాని మోడీ మనస్సాక్షిగా ఓటేయాలని పిలుపునిచ్చినా విపక్ష కూటమి తన బలిమిని చాటింది. ఒక్కరు కూడా అనుకూలంగా కలసి రాలేదు. రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. లోక్‌సభలో మొత్తం సభ్యుల సంఖ్య 540. అంటే బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 360 మంది మద్దతు కావాలి. అధికార ఎన్డీఏ కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. అందువల్ల మరో 68 మంది మద్దతు అవసరం. మరోవైపు విపక్షాల బలం 233. వీరు కాకుండా స్వతంత్రులు, తటస్థ పార్టీలకు చెందిన వారు కలిసి 15 మంది ఉన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఎక్కువ మంది గైర్హాజరైతే బిల్లు గ్టటెక్కే అవకాశం ఉందని అధికార ఎన్డీఏ భావించింది. సాయంత్రం 6 గంటలకు లోక్‌సభలో హోం మంత్రి అమిత్‌షా ప్రసంగించాక, ఈ బిల్లులపై ఓటింగ్ జరిగింది. ఓటింగ్ సమయంలో ప్రధాని మోడీ కూడా సభలోనే ఉన్నారు. ఓటింగ్ అనంతరం కిరణ్ రిజిజు ప్రకటన చేశారు. దీంతో సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్ల ప్రకటించారు.

# మహిళా సాధికారత కోసమే మా ప్రయత్నం

### ఉత్తర దక్షిణ పేరుతో విభజన సరికాదు

### ఈ దేశంలో అన్ని ప్రాంతాల వారికి సమాన హక్కులు

### మహిళా బిల్లును వ్యతిరేకిస్తామని చెప్పడం సరికాదు

### మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కుదరవు

### డీలిమిటేషన్‌తో ఎస్సీ,ఎస్టీ సీట్లు పెరుగతాయి

### వారి సీట్ల పెపును అడ్డుకోవడం సరికాదు

### లోక్‌సభలో చర్చకు సమాధానం ఇచ్చిన అమిత్ షా

న్యూఢిల్లీ

లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై రెండ్రోజులగా సుదీర్ఘ చర్చ జరిగింది. శుక్రవారం విపక్ష నేత రాహుల్ గాంధీ, తదితరులు మాట్లాడారు. సవరణ బిల్లును ఓడిస్తామని ప్రకటించారు. అనంతరం సభలో సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. మహిళా సాధికారత కోసమే ఈ బిల్లులను తీసుకొచ్చామని, వచ్చే ఎన్నికల్లో వీటిని అమలు చేసేలా ముందుకెళ్తున్నామన్నారు. అయితే, ఇండి కూటమి సభ్యులు దీన్ని వ్యతిరేకించారని అన్నారు. మూడు బిల్లులపై సమగ్రంగా చర్చ జరిగింది. 130 మంది ఎంపీలు తమ అభిప్రాయాలు చెప్పారు. 56 మంది మహిళా ఎంపీలు మాట్లాడారు. మహిళా బిల్లును విపక్షాలు వ్యతిరేకించాయి. ప్రస్తుత లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో భారీ వ్యత్యాసం ఉంది. ఒకచోట 39లక్షల మంది ఓటర్లు ఉంటే మరోచోట 60 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఒక ఎంపీ లక్షలాది మంది సమస్యలను ఎలా ఆలకించగలరని ఈ సందర్భంగా ప్రస్తావించారు. నియోజకవర్గాల ఓటర్ల సంఖ్యలో సమతుల్యతను సాధించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఎంపీ తన నిధులు సమర్థంగా వినియోగించుకునేందుకు ఇది తోడ్పడుతుంది. అందుకే ఈ రాజ్యాంగ సవరణకు ఉపక్రమించామని అమిత్ షా పేర్కొన్నారు. మల్కాజ్‌గిరిలో దాదాపు 30లక్షల మందికిపైగా ఓటర్లు ఉండగా.. ఢిల్లీ, బెంగళూరు, గాజియాబాద్‌లో 20లక్షలకుపైగా ఓటర్లు ఉన్నారు. డీలిమిటేషన్ తర్వాత ఆయా చోట్ల రెండు సీట్లు వస్తాయి. దీనివల్ల సభ్యులకు, ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. 1972లో ఇందిరా గాంధీ ప్రభుత్వం లోక్‌సభ సీట్లను 545కు పెంచింది. ఇన్నాళ్లపాటు సీట్లు సంఖ్య పెంచకుండా అడ్డుకున్న ఘనత వారిదే అని కాంగ్రెస్‌పై అమిత్ షా విరుచుకుపడ్డారు. కాలానికి అనుగుణంగా సీట్ల సంఖ్యలోనూ మార్పు రావాలని అన్నారు. ఉత్తరాది.. దక్షిణాది.. ఆ ప్రాంతం.. ఈ ప్రాంతం అంటూ విభజన రాజకీయాలు చేస్తున్నారు. దేశమంతా ఒక్కటే. ఉత్తర, దక్షిణ బేధాలు చూపి దేశాన్ని ముక్కలు చేస్తామంటే కుదరదు. దక్షిణమే కాదు.. కేంద్రపాలిత ప్రాంతాలకు సైతం దేశంపై అంతే అధికారం ఉంటుంది. ప్రాంతాలకు అతీతంగా ఈ సభలోని సభ్యులందరికీ సమాన అధికారం ఉంటుందని అమిత్ షా పేర్కొన్నారు. మహిళా బిల్లును, డీలిమిటేషన్ బిల్లును వేరు చేస్తారా? ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం 50శాతం పెంచుతారా? అని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. దీనికి అమిత్ షా బదులిస్తూ.. 50శాతం పెంచుతూ సవరణ తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గంట సమయం ఇస్తే బిల్లులో సవరణలు చేసుకొని వస్తామని.. బిల్లుకు మద్దతిస్తారేమో చెప్పాలని అమిత్ షా స్పష్టం చేశారు. కూటమి లక్ష్యంగా ఘాటైన విమర్శలు చేశారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే చారిత్రాత్మక నిర్ణయాన్ని 'ఇండి' కూటమి సభ్యులు వ్యతిరేకించడం విచారకరమని అమిత్ షా అన్నారు.మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతు ఇవ్వకుండా అడ్డుకోవడం ఎందుకని అమిత్ షా కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాల్ని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన మూడు బిల్లులకు మహిళా రిజర్వేషన్ల బిల్లుతో విడదీయలేని సంబంధం ఉందని ఆయన వివరించారు. ఈ ప్రక్రియ అంతా ఒక పద్ధతి ప్రకారం సాగుతోందని చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకించడం అంటే.. ఎస్సీ, ఎస్టీ సీట్ల పెంపును వ్యతిరేకించడమేనని అమిత్ షా అన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వ్‌డ్ సీట్ల సంఖ్య పెరగాలంటే పునర్విభజన అనివార్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం వివిధ లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయని, ప్రజాస్వామ్యబద్ధంగా అందరికీ సమాన ప్రాతినిధ్యం దక్కాలంటే పునర్విభజన అవసరమని అమిత్ షా నొక్కి చెప్పారు. వచ్చే సాధారణ ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు క్షేత్రస్థాయిలో



అమలు చేసేలా మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తోందని అమిత్ షా ప్రకటించారు. సభలో ప్రస్తుతం 56 మంది మహిళా ఎంపీలు ఉండటం శుభపరిణామమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్లకు విపక్షాలు వ్యతిరేకమనే విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తప్పుపట్టారు. వారిది మహిళా వ్యతిరేక మైండ్‌సెంట్ అన్నారు. డీలిమిటేషన్‌పై విపక్షాలు ప్రభుత్వాన్ని నమ్మాలని అన్నారు. పార్లమెంటు సభ్యుల సంఖ్యను విస్తరించేందుకు, వచ్చే ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేసేందుకు ముందుకు వెళు _న్నామని చెప్పారు. మూడు బిల్లులపై లోక్‌సభలో సమగ్రంగా చర్చ జరిగిందని, అన్ని పార్టీలు తమ వాదనలు వినిపించాయని, ఇండియా కూటమి సభ్యుల్లో చాలామంది మాట్లాడారని అన్నారు. రాజ్యాంగ సవరణ వల్ల దక్షిణ భారతదేశానికి ప్రాతినిధ్యం బలహీనమవుతుందనడంలో ఎంత మాత్రం నిజం లేదని అమిత్‌షా వివరించారు. బిల్లు ఆమోదం తర్వాత దక్షిణ భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే సభ్యులు, శాతం రెండూ పెరుగుతాయని వివరించారు. ప్రస్తుతం 543 మంది లోక్‌సభ సభ్యుల్లో దక్షిణాదిన 129 మంది ఎంపీలు ఉన్నారని, అది 195కు పెరుగుతుందని చెప్పారు. పార్లమెంటులో దక్షిణాది ప్రాతినిధ్యం పెరగడం వల్ల బలమైన గొంతు వినిపించే అవకాశం ఉంటుందని వివరించారు.

# రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వం

### బ్రిటన్ పౌరసత్వం కలిగి ఉన్నట్లు ఆరోపణలు

### విచారణకు ఆదేశించిన అలహాబాద్ హైకోర్టు


న్యూఢిల్లీ,

ద్వంద్వ పౌరసత్వం ఆరోపణలకు సంబంధించి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విచారణ జరపాలని అక్కడి లఖ్‌నవూ బెంచ్ ఉత్తర్వులిచ్చింది. ఈ కేసు దర్యాప్తును ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వమే స్వయంగా నిర్వహించాలని లేదంటే.. ఒక కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని పేర్కొంది. రాహుల్ గాంధీ పౌరసత్వం అంశంపై కొన్నేళ్లుగా వివాదం నలుగుతూనే ఉంది. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని, భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలంటూ భాజపా నేత సుబ్రహ్మణ్య స్వామి, కర్ణాటకకు చెందిన భాజపా కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ డిమాండ్ చేస్తున్నారు. బ్రిటన్‌లో నమోదైన ఓ కంపెనీకి రాహుల్ గాంధీ డైరెక్టర్, సెక్రటరీగా ఉన్నారని సుబ్రహ్మణ్య స్వామి కొంతకాలంగా చెబుతున్నారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలో తనను తాను బ్రిటిష్ పౌరుడిగా రాహుల్ గాంధీ పేర్కొన్నట్లు స్వామి తెలిపారు. వేరే దేశంలో పౌరుడిగా ఉన్న వ్యక్తి ఆ దేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందన్నారు. అలా చేయకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 9, భారతీయ పౌరసత్వ చట్టం, 1955ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. ఇదే అంశంపై గతంలో కేంద్రానికి కూడా లేఖ రాశారు. మరోవైపు, రాహుల్ గాంధీ పౌరసత్వానికి సంబంధించిన రికార్డులు ఉన్నాయని విఘ్నేశ్ చెబుతున్నారు. ఈ క్రమంలోనే న్యాయస్థానాలను ఆశ్రయించారు. పౌరసత్వానికి సంబంధించిన అంశాలపై నిర్ణయం తీసుకునే అధికారం తనకు లేదంటూ లఖ్‌నవూలోని ప్రత్యేక ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు గతంలో శిశిర్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. దాంతో అతడు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలోనే తాజా ఆదేశాలు వెలువడ్డాయి.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

# ఆట



# సన్ రైజర్స్‌కు మరో భువీ దొరికేశాడు..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో సోమవారం అద్భుతం చోటు చేసుకుంది. ఐపీఎల్ మొదలై ఇప్పటికే 18 ఏళ్లు పూర్తయ్యింది. ప్రస్తుతం 19వ సంవత్సరం నడుస్తుంది. ఈ 19 ఏళ్లలో ఇప్పటి వరకు నమోదు కానీ ఒక అద్భుతం సోమవారం జరిగింది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన పోరులో సన్ రైజర్స్ హైదరాబాద్ యువ పేసర్ ఈ ఘనతను సాధించాడు. ఒకప్పుడు సన్ రైజర్స్ హైదరాబాద్‌కు బౌలింగ్ టీమ్ అనే పేరు ఉండేది. తక్కువ స్కోర్లను కూడా డిఫెండ్ చేసుకునే నైపుణ్యం ఉండేది. అయితే గత నాలుగైదేళ్ల కాలంలో పరిస్థితులు మారిపోయాయి. ఈ ఐపీఎల్ ఆరంభానికి ముందు వరకు కూడా లీగ్‌లో అత్యంత బలహీనమైన బౌలింగ్ ఏదంటే ప్రతి ఒక్కరు సన్ రైజర్స్ హైదరాబాద్ అని చెప్పారు. అందుకు తగ్గట్లే తొలి 4 మ్యాచ్‌ల్లోనూ సన్ రైజర్స్ ఆటతీరు కనిపించింది. తొలి 4 మ్యాచ్‌ల్లో 3 సార్లు సన్ రైజర్స్ హైదరాబాద్ 200కు పైగా పరుగులు చేసింది. అయితే కేవలం ఒక్కసారి మాత్రమే డిఫెండ్ చేసుకోగలిగింది. మిగిలిన 2 సార్లు ఓడింది. దాంతో సన్ రైజర్స్ హైదరాబాద్ 250 కొట్టినా గెలవదనే ప్రచారం మొదలైంది. అయితే రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన పోరుతో సన్ రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్‌కు కొత్త ఊపు వచ్చింది.రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన పోరు ద్వారా సన్ రైజర్స్ తరఫున ప్రఫుల్ హింగే, సకీబ్ హుస్సేన్‌లు అరంగేట్రం చేశారు. ఈ ఇద్దరిని కూడా గతేడాది జరిగిన మినీ వేలంలో సన్ రైజర్స్ హైదరాబాద్ సొంతం చేసుకుంది. ఈ ఇద్దరు కూడా తమ డెబ్యూ మ్యాచ్‌లో డ్రీమ్ స్పెల్ వేశారు. ప్రఫుల్ హింగే అయితే తొలి ఓవర్లోనే 3 వికెట్లు తీశాడు. ఐపీఎల్ చరిత్రలో ఇన్నింగ్స్ మొదటి ఓవర్లో 3 వికెట్లు పడటం ఇదే తొలిసారి. ప్రఫుల్ హింగేలో మరో భువనేశ్వర్ కుమార్ ఛాయలు కనిపించాయి. బంతిని స్వింగ్ చేస్తున్నాడు. డెక్‌ను గట్టిగా హిట్ చేస్తున్నాడు. బౌన్స్‌ను రాబడుతున్నాడు. భువీలో లేని వేగం ప్రఫుల్ హింగేలో కనిపించింది. ఈ సీజన్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ బౌలర్ తొలిసారి 140 కంటే ఎక్కువ వేగంతో బౌలింగ్ చేశాడు. తొలి మ్యాచ్‌లోనే ప్రఫుల్ హింగే 4 వికెట్లు తీసి ఔరా అనిపించాడు.ప్రఫుల్ హింగేలో మరో భువనేశ్వర్ కుమార్ ఛాయలు కనిపించాయి. బంతిని స్వింగ్ చేస్తున్నాడు. డెక్‌ను గట్టిగా హిట్ చేస్తున్నాడు. బౌన్స్‌ను రాబడుతున్నాడు. భువీలో లేని వేగం ప్రఫుల్ హింగేలో కనిపించింది. ఈ సీజన్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ బౌలర్ తొలిసారి 140 కంటే ఎక్కువ వేగంతో బౌలింగ్ చేశాడు. తొలి మ్యాచ్‌లోనే ప్రఫుల్ హింగే 4 వికెట్లు తీసి ఔరా అనిపించాడు.మొన్నటి వరకు వీక్ అనుకున్న పేస్ బౌలింగ్.. ఇప్పుడు బలంగా కనిపిస్తుంది.

# 20 ఏళ్ల రికార్డు మిస్!

వైభవ్ సూర్యవంశీ.. క్రికెట్‌లో ప్రస్తుతం ఇతడో సంచలనం. 15 ఏళ్ల వయసులోనే మేటీ బౌలర్లను ఎదుర్కొంటూ పరుగులు సాధిస్తున్నాడు. తన వయసు పిల్లలు స్కూల్స్‌కు వెళ్తూ.. అండర్ 15, 16 టోర్నీలు ఆడుతుంటే మనోడు మాత్రం సీనియర్ ప్లేయర్లతో ఢీ అంటే ఢీ అంటున్నాడు. బుమ్రా, బౌల్ట్, భువనేశ్వర్ కుమార్, హేజల్ వుడ్ లాంటి బౌలర్లను ఎదుర్కొంటున్నాడు. బుమ్రా వేసిన తొలి బంతినే సిక్సర్ బాది అందరినీ ఆశ్చర్యపరిచాడు. సన్ రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్ ముందు వరకు కూడా 4 మ్యాచ్‌లలో వరుసగా 52, 31, 39, 78 పరుగులు చేశాడు. ఈ సీజన్‌లో ఆరెంజ్ క్యాప్ కోసం పోటీ పడుతున్నాడు. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న అతనిపైనే అందరి దృష్టి ఉంది. కానీ, సన్ రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన పోరులో వైభవ్ సూర్యవంశీ ఒక చెత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. సన్ రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన పోరులో వైభవ్ సూర్యవంశీ ఎదుర్కొన్న తొలి బంతికే అవుటయ్యాడు. గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ కెరీర్‌లో గోల్డెన్ డక్‌గా వెనుదిరగడం ఇదేతొలిసారి. 2025 సీజన్‌లో ఒక మ్యాచ్‌లో రెండు బంతులకు డకౌట్ అయ్యాడు. కానీ, గోల్డెన్ డక్ అవ్వడం ఇదే తొలిసారి. ఇక అదే సమయంలో 20 ఏళ్ల క్రితం నెలకొల్పిన రికార్డును సమం చేయడంలో విఫలం అయ్యాడు. క్రికెట్ చరిత్రలో అత్యంత వేగంగా 1000 పరుగులు చేసిన రికార్డును సమం చేసే అవకాశం సూర్యవంశీకి లభించింది. ఈ రికార్డును బ్రాడ్ హాడ్జ్, షాన్ మార్ష్ సంయుక్తంగా కలిగి ఉన్నారు. వారిద్దరూ టీ20 క్రికెట్‌లో 23 ఇన్నింగ్స్‌లలో 1000 పరుగులు సాధించారు. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఇప్పటివరకు 22 ఇన్నింగ్స్‌లలో 901 పరుగులు చేశాడు. సన్ రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్ అతనికి 23వ మ్యాచ్. ఇందులో అతను మరో 99 పరుగులు చేస్తే, 20 ఏళ్ల నాటి రికార్డును సమం చేస్తాడు. అయితే ఎదుర్కొన్న తొలి బంతికే అవుటవ్వడంతో అరుదైన అవకాశాన్ని మిస్ చేసుకున్నాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు సాధించిన సన్‌రైజర్స్, ప్రత్యర్థికి 217 పరుగుల క్లిష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇషాన్ కిషన్ (44 బంతుల్లో 91; 8 ఫోర్లు, 6 సిక్సర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. హెన్రిచ్ క్లాసెన్ (26 బంతుల్లో 40; 1 ఫోర్, 3 సిక్సర్లు) మరోసారి నిలకడ ప్రదర్శించాడు. అనంతరం రాజస్తాన్ రాయల్స్ 19 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌటైంది. ప్రఫుల్ హింగే, సకీబ్ హుస్సేన్‌లు చెరో 4 వికెట్లతో రాజస్తాన్ రాయల్స్ నడ్డి విరిచారు. ఈషాన్ మలింగకు 2 వికెట్లు దక్కాయి. డెనొవాన్ ఫెరీరా (69) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రవీంద్ర జడేజా (45) రాణించాడు. వీరిద్దరు మినహా రాజస్థాన్ బ్యాటింగ్ పేకమేడలా కుప్పకూలింది.



# 19ఏళ్ల ఐపీఎల్ హిస్టరీలో చరిత్ర సృష్టించిన ప్రఫుల్

అరంగేట్ర యువ పేసర్లు ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ అద్భుత ప్రదర్శనతో సొంతగడ్డపై ఆరెంజ్ ఆర్మీ అద్భుత విజయం నమోదు చేసింది. ఆల్?రౌండ్? షోతో ప్రత్యర్థి రాజస్థాన్?ను 57 పరుగుల తేడాతో చిత్తు చేసింది. 216 పరుగుల ఛేదనలో రాజస్థాన్ 19 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌట్ అయ్యింది. అయితే సన్?రైజర్స్? సూపర్ విక్టరీ ఘనత ప్రఫుల్, సాకిబ్?కే దక్కుతుంది. ఐపీఎల్? కెరీర్?లో ఆడుతున్న తొలి మ్యాచ్?లోనే ఈ రేంజ్? ప్రదర్శన చేసిన ప్రఫుల్, సాకిబ్ అసలు ఎవరు అని ఫ్యాన్స్? నెట్టింట వెతుకుతున్నారు. 24 ఏళ్ల ప్రఫుల్ మహారాష్ట్రకు చెందిన బౌలర్. అతడు తన అరంగేట్ర ఐపీఎల్ మ్యాచ్‌లో తొలి ఓవర్లోనే మూడు వికెట్లు పడగొట్టి ఐపీఎల్?లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ప్రఫుల్ హింగ్ ముఖ్యంగా ఫుల్ ఫామ్?లో ఉన్న వైభవ్ సూర్యవంశీతో సహా ధ్రువ్ జురెల్, ప్రిటోరియస్?ను పెలియన్ చేర్చి, 19 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో తొలి ఓవర్‌లోనే మూడు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా నిలిచాడు. గతంలో ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో రెండు వికెట్లు తీసిన సందర్భాలు ఉన్నాయి. కానీ, మూడు వికెట్లు పడగొట్టింది మాత్రం ప్రఫులే. సాకిబ్ హుస్సెన్ బిహార్?కు చెందిన క్రికెటర్. గతేడాది జరిగిన మినీవేలంలో అతడిని సన్?రైజర్స్ రూ.30 లక్షల కనీస ధరకు దక్కించుకుంది. 2024లో కేకేఆర్ సాకిబ్?ను కొనుగోలు చేసినా బరిలో దింపలేదు. దీంతో సాకిబ్ సత్తా చాటుకోవడానికి ఇన్నేళ్లు పట్టింది. గతేడాది జరిగిన డొమెస్టిక్? లీగుల్లో సాకిబ్ బుల్లెట్ లాంటి బంతులు సంధించి బ్యాటర్లకు వణుకు పుట్టించాడు. దీంతో సన్?రైజర్స్ మేనేజ్?మెంట్ దృష్టిలో పడ్డాడు. ఇక ఐదో మ్యాచ్?లో అవకాశం దక్కించుకున్న అతడు ఈ ఛాన్స్?ను రెండు చేతులా అందింపుచ్చుకున్నాడు. అతడి టాలెంట్? ప్రపంచానికి చాటుకున్నాడు. ప్రస్తుతం ఈ ఇద్దరి పేర్లు క్రీడావర్గాల్లో హాట్ టాపిక్?గా మారిపోయాయి. ఈ మ్యాచ్?తో ప్రఫుల్, సాకిబ్ అరుదైన లిస్ట్?లో చోటు దక్కించుకున్నారు. ఐపీఎల్ అరంగేట్రంలోనే 4 వికెట్లు తీసిన భారత బౌలర్ల జాబితాలో నిలిచారు. ఇప్పటిదాకా ఈ ఘనత ఐదుగురు బౌలర్లు సాధించారు. గతంలో షాదాబ్ జకాతి, అశ్వని కుమార్, పాల్ వాల్థాటి ఈ ఫీట్ సాధించారు. వీళ్లంతా ఈ ఘనత అందుకున్ననాటికి అన్?క్యాప్డ్ ప్లేయర్లు కావడం విశేషం. సన్?రైజర్స్ నిర్దేశించిన 217 భారీ ఛేదనలో బలమైన బ్యాటింగ్ లైనప్? ఉన్న రాజస్థాన్ 19 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌటైంది. డొనోవన్ ఫెరీరా (69), రవీంద్ర జడేజా (40) కీలక ఇన్నింగ్స్ ఆడారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# సినిమా
CINEMA

# ఫ్రాన్స్ యానిమేషన్ ఫెస్టివల్‌లో యానిమేషన్ బాహుబలి

## భారతీయ చిత్ర పరిశ్రమకు దక్కిన గుర్తింపు అన్న రాజమౌళి

రాజమౌళి సృష్టించిన 'బాహుబలి' మరో ఘనతను సొంతం చేసుకుంది. ఆయన రూపొందించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న సరికొత్త యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ద ఎటర్నల్ వార్' . 2027లో ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ చిత్రం ఒక అరుదైన మైలురాయిని చేరుకుంది. ఫ్రాన్స్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక ఎన్నేసి యానిమేషన్ ఫెస్టివల్ 2026 లోని 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' విభాగంలో ప్రదర్శనకు అధికారికంగా ఎంపికైంది. దీనిపై రాజమౌళి ఆనందం వ్యక్తంచేశారు. యానిమేషన్ అనేది హద్దులు లేని అద్భుతమైన ప్రపంచమనే విషయాన్ని నేను ఎప్పుడూ నమ్ముతానని ఈ సందర్భంగా అన్నారు. ఇది మన భారతీయ సినిమాకి దక్కిన ఒక అరుదైన గౌరవంగా భావిస్తున్నా. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన యానిమేషన్ వేదికపై ఈ సినిమాను ప్రదర్శించే అవకాశం రావడం మాకెంతో ఆనందంగా ఉంది. దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం అని రాజమౌళి పోస్ట్ పెట్టారు. యానిమేషన్ రంగంలో ఈ ఫెస్టివల్‌ను 'యానిమేషన్ ప్రపంచపు కేన్స్ ఫెస్టివల్'గా పరిగణిస్తారు. భారతీయ యానిమేషన్ సత్తాను ప్రపంచ వేదికపై చాటిచెప్పేందుకు ఇదొక గొప్ప అవకాశంగా సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.




అమరేంద్ర బాహుబలి మరణం తర్వాత జరిగే పరిణామాల నేపథ్యంలో దీన్ని రూపొందిస్తున్నారు. దాదాపు రూ.120 కోట్ల భారీ బడ్జెట్‌తో 'ఆర్కా మీడియా వర్క్స్' ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

# సర్ మరో అవకాశం ఇవ్వండి

## బుచ్చిబాబు పోస్ట్.. వైరల్

ప్రస్తుతం అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ పెద్దితో బిజీగా ఉన్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదల కానుంది. వీరిద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా రామ్‌చరణ్ 'ఎస్క్వైర్ ఇండియా' కు ఇంటర్వ్యూ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోను ఆయన ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. ఈ ఫోటోల్లో చరణ్ స్టైలిష్ లుక్‌కు అభిమానులు ఫిదా అవుతున్నారు. దీనికి దర్శకుడు బుచ్చిబాబు చేసిన కామెంట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'సర్.. మరో అవకాశం ఇవ్వండి' అని సరదాగా కామెంట్ చేశారు. ఈ చిన్న కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. దీంతో 'పెద్ది' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా రానుందని వార్తలు మొదలయ్యాయి. గ్యాంగ్‌స్టర్ సినిమా తీయమంటూ అభిమానులు కూడా రిప్లైలు పెడుతున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరూ పెద్దిపై పూర్తి ఫోకస్ పెట్టారు. ఇప్పటివరకూ విడుదలైన ఈ సినిమాలోని పాటలు ఆదరణను సొంతం చేసుకోవడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.





అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# తేజస్వి సూర్య వ్యాఖ్యలపై నిప్పులు చెరిగిన కాంగ్రెస్

## నల్గొండలో ఎంపీ దిష్టిబొమ్మ దహనం

## తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్ విభజనతో పోల్చడంపై డీసీసీ అధ్యక్షులు కైలాష్ నేత ఆగ్రహం





ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై పార్లమెంట్‌లో కర్ణాటక ఎంపీ తేజస్వి సూర్య చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఉమ్మడి నల్గొండ జిల్లాలో రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్ విభజనతో పోల్చడాన్ని నిరసిస్తూ, నల్గొండ డీసీసీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం భారీ నిరసన చేపట్టాయి.?నల్గొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్ వద్ద కాంగ్రెస్ నేతలు నల్ల రిబ్బన్లు ధరించి బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎంపీ తేజస్వి సూర్య దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పున్న కైలాష్ నేత మాట్లాడుతూ బీజేపీ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 4 కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన దేవత సోనియా గాంధీ. 60 ఏళ్ల కలను సాకారం చేసే క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ నష్టపోతుందని తెలిసినా, ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ఇచ్చిన గొప్ప మానవతావాది ఆమె అని కొనిఆడారు. అటువంటి పవిత్రమైన తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్ విభజనతో పోల్చడం తెలంగాణ ప్రజల త్యాగాలను అవహేళన చేయడమే అని మండిపడ్డారు.

### బీజేపీపై విమర్శల అస్త్రాలు...

నియోజకవర్గాల పునర్విభజనపై సీఎం రేవంత్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక మోదీ, అమిత్ షా లు కుట్రలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. దక్షిణ భారతదేశంపై బీజేపీ చూపిస్తున్న వివక్షను సీఎం రేవంత్ రెడ్డి ఎండగడుతుంటే, దేశవ్యాప్తంగా దానిపై చర్చ జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంపై బీజేపీ విషం చిమ్ముతున్నా, ఇక్కడి బీజేపీ నేతలు నోరు మెదపకపోవడం సిగ్గుచేటని, వారిని తెలంగాణ ద్రోహులు'గా పరిగణించాలని పిలుపునిచ్చారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు ప్రధాని మోదీ వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎండి. ముంతాజ్ అలీ, పేరిక వెంకటేశ్వర్లు, జిల్లాపల్లి పరమేశ్, నోముల జనార్ధన్, కోమటిరెడ్డి అంజి రెడ్డి, చింతమల్ల వెంకటయ్య, వేముల గోపీనాథ్, పగుళ్ళ రాజు, చర్లపల్లి గౌతమ్, మేకల సాగర్ రెడ్డి, అంబల హరీష్, పల్లా రవి తేజ, కాటం వెంకన్న, బోడ అరుణ్, ఇందనూరి శ్రీను, పేరిక అంజయ్య, ఈథ శేఖర్, ఎండీ అజీజ్, ఎండీ ఫిరోజ్, వినీత్, సన్నీ, కౌశిక్, జశ్వంత్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ ఆర్డీవో కార్యాలయం వద్ద తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ నిరసన

పి ఆర్ సి అమలు, బిల్లుల విడుదల, సిపిఎస్ రద్దుపై ఉద్యోగుల ఆందోళన



అక్షరకలం దేవరకొండ

తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆదేశాల మేరకు దేవరకొండ డివిజన్ తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కార్యాలయం ముందు ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తమ సమస్యలను తెలియజేస్తూ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌కు వినతి పత్రం సమర్పించారు. భోజన విరామ సమయంలో జరిగిన ఈ కార్యక్రమానికి దేవరకొండ యూనిట్ తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షురాలు డి. రుణాదేవి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చేశారు. పే రివిజన్ కమిషన్‌ను వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. అలాగే మిగిలిన 62 డిమాండ్లను కూడా త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ డివిజన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు, సెక్రటరీ జంగయ్య, ట్రెజరర్ నాగరాజు పాల్గొన్నారు. అదనంగా నాలుగో తరగతి సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది మరియు ఇతర కార్యాలయాల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కోదాడ ఆర్డీవో ఆఫీస్ వద్ద తెలంగాణ ఉద్యోగుల, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ నిరసన



అక్షర కలం కోదాడ

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జంట కార్యాచరణ సమితి కోదాడ యూనిట్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. శుక్రవారం కోదాడ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం ఎదుట టీఎన్జీవో అధ్యక్షుడు గడ్డం చిరంజీవి ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో హాజరై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 2వ పీఆర్సీ ని తక్షణమే అమలు చేయాలని, సిపిఎస్ స్కీమ్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే విడుదల చేసి ఉద్యోగులకు, పెన్షనర్లకు నగదు రహిత వైద్యం కోసం హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల అధ్యక్ష,కార్యదర్శులు గడ్డం చిరంజీవి, తీగల నరేష్, రావెళ్ల సీతారామయ్య, వేనేపల్లి శ్రీనివాసరావు, బంధం వెంకటేశ్వర్లు, ఆర్సి రెడ్డి,రామ నరసయ్య, బడుగుల సైదులు, పాండురంగాచారి, పాల్గొన్నారు.

# అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్:

8 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

అక్షరకలం దేవరకొండ



కొండమల్లేపల్లి మండల పరిధిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మండలంలోని కోల్ ముంతల్ పహాడ్ గేట్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీలు నిర్వహిస్తుండగా టీఎస్ 12 యూఏ 2982 నంబర్ గల టవేరా వాహనం అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు దానిని ఆపి తనిఖీ చేశారు. వాహనంలో తనిఖీ చేయగా, 18 బస్తాల్లో సుమారు 8 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమయ్యాయి. వాహనంలో ఉన్న కడ్తల్ మండలం పల్లి చెల్క తండాకు చెందిన నేనవత్ గోపాల్ (తండ్రి: బిచ్చా), జర్పుల కుమార్ (తండ్రి: జానీ, 23 సం॥)లను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దేవరకొండ, కొండమల్లేపల్లి మండలాల్లోని చుట్టుపక్కల గ్రామాల్లో తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారుల నుండి తక్కువ ధరకు ఈ బియ్యాన్ని సేకరించినట్లు వారు అంగీకరించారు. ఈ బియ్యాన్ని చారకొండలో ఎక్కువ ధరకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారు. అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్న నిందితులపై కేసు నమోదు చేసి, వాహనాన్ని మరియు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఈ కేసుపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రజా పోరాటాలపై ప్రభుత్వాల నిర్బంధం ఆపాలి

## సీఐటీయూ డిమాండ్

## కార్పొరేట్ శక్తులకు కేంద్రం కొమ్ముకాస్తోంది

## తుమ్మల వీరారెడ్డి ధ్వజం

## ఉత్తరాది కార్మికుల అక్రమ అరెస్టులకు ఖండన

## చలో అసెంబ్లీ నిర్బంధంపై ఆగ్రహం

## మే 1 నుండి 19 వరకు సాంస్కృతిక, చైతన్య కార్యక్రమాలు

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం



ప్రజా పోరాటాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్బంధాన్ని ఆపాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం దొడ్డి కొమరయ్య భవన్ లో సిఐటియు జిల్లా కమిటీ సమావేశం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ హర్యానా ఢిల్లీ పరిసర ప్రాంతాలైన నోయిడాలో సుమారు 50 వేల మంది కార్మికులు పోరాటంలో ఉంటే కార్పొరేట్ యజమాన్యాలకు బిజెపి ప్రభుత్వం పోలీసు నిర్బంధాన్ని ప్రయోగించి అక్రమ అరెస్టులు చేస్తుందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కార్మికులకు హామీలు ఇచ్చి అమలు చేయకపోవడంతో బడ్జెట్ సమావేశాల సందర్భంగా చలో హైదరాబాద్ సందర్భంగా అంగన్వాడి ఆశ గ్రామపంచాయతీ వివో ఏ లను అర్ధరాత్రి ముందస్తు అరెస్టు చేసి చలో అసెంబ్లీలో భగ్నం చేయడానికి నిర్బంధాన్ని ప్రయోగించిందని ఆరోపించారు. కనీస వేతనాల జీఓ ల సవరించడంలో, కార్మిక హక్కులు రక్షించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి. సలీం మాట్లాడుతూ ప్రపంచ కార్మిక దినోత్సవం మే ఒకటి సందర్భంగా అన్ని యూనియన్లు వాడవాడలా జండాలను ఆవిష్కరించి ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్మికుల పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి తెచ్చిన నాలుగు కోడ్లు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మే 1 నుండి మే 19 పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఆటపాట సభలు, సమావేశాలు నిర్వహించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మికులలో చైతన్యం నింపడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు మేడే కార్యక్రమాలు నిర్వహించడానికి ఈనెల 20 నుండి 26 వరకు అన్ని యూనియన్ మండల నియోజకవర్గ సాయి మేడే సన్నహక సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చినపాక లక్ష్మీనారాయణ, జిల్లా సీనియర్ ఉపాధ్యక్షులు డబ్బికార్ మల్లేష్, ఉపాధ్యక్షులు దండంపల్లి సత్తయ్య, మల్లు గౌతమ్ రెడ్డి, చింతపల్లి బయన్న, లకపాక రాజు, జిల్లా సహాయ కార్యదర్శిలు నల్ల వెంకటయ్య, ఏర్పుల యాదయ్య ,పెంజర్ల సైదులు, అవుట రవీందర్, షేక్ బషీర్, డి రవి నాయక్, జిల్లా కమిటీ సభ్యులు రొండి శ్రీనివాస్, వంటపాక వెంకటేశ్వర్లు మహేశ్వరి, సైదమ్మ ,జానకి, అనురాధ, పోలె సత్యనారాయణ, జేరిపోతుల ధనంజయ్, వరికుప్పల ముత్యాలు, పున్న అంజయ్య, నరసింహా, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికులపై అణిచివేత, మానవ హక్కుల ఉల్లంఘన ను అరికట్టాలి .. ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి

యాదాద్రి భువనగిరి అక్షర కలం

నేషనల్ క్యాపిటల్ కారిడార్ (ఢిల్లీ ,హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్) పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని, కార్మికులతో 8 గంటల పనికి బదులుగా 13, 14 గంటలు పని చేయిస్తూ కనీస వేతనాలు ఇవ్వడం లేదని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఎన్ సీ ఆర్ ప్రాంతాల్లో ఉన్న అధికార యంత్రాంగం, పారిశ్రామిక ప్రాంతాల కార్మికులపై , కార్మికుల కుటుంబాలపై దాడులు చేస్తూ , అక్రమ కేసులను బనాయిస్తున్నారని ఆయన అన్నారు. కార్మికులకు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) అండగా ఉంటుందని, కొత్త లేబర్ కోడ్లు కార్మికులకు వారి హక్కులకు వ్యతిరేకంగా ఉన్నాయని అన్నారు, ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ మరియు హర్యానా, రాష్ట్రాల్లో పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికులపై జరుగుతున్న అణిచివేత, మానవ హక్కుల ఉల్లంఘనను ఐలు తీవ్రంగా ఖండిస్తుందని , వెంటనే ఈ దాడులను, మానవ హక్కుల ఉల్లంఘనను ఆపాలని రూల్ ఆఫ్ లా ను పాటించాలని ఆయన కోరారు. పత్రికా ప్రకటనలో ఐలు జిల్లా గౌరవ అధ్యక్షులు కుక్కదూవు సోమయ్య, అధ్యక్షులు బొల్లెపల్లి కుమార్, ఉపాధ్యక్షులు తడక మోహన్, పాల్వంచ జగతయ్య, ఎండి నిహాల్, సీసా శ్రీనివాస్, సూదగాని శ్రీహరి, చింతల రాజశేఖర్ రెడ్డి, బొడ్డు కిషన్, ఐలయ్య, మల్లేష్, జిట్టా భాస్కర్ రెడ్డి, ఎండి హమీద్, చింతల రాజు తదితరులు ఉన్నారు.



# రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి దక్కాలని మొక్కు..

ముష్టిపల్లి లింగస్వామి పాదయాత్రకు ఘనస్వాగతం

అక్షరకలం, చండూరు

మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కాలని కాంక్షిస్తూ, ముష్టిపల్లి గ్రామానికి చెందిన ముష్టిపల్లి లింగస్వామి ముష్టిపల్లి నుండి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన చెరువుగట్టు వరకు చేపట్టిన పాదయాత్రకి ఉడతలపల్లి గ్రామస్తులు మరియు నాయకులు లింగస్వామికి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఉడుతలపల్లి గ్రామ సర్పంచ్ కావలి శివాని సురేష్, మాజీ సర్పంచ్ కావాలి ఆంజనేయులు, మాజీ సర్పంచ్ మేకల వెంకన్న, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుసిపాక శంకర్, వార్డ్ మెంబర్ కావలి అశోక్ లతో పాటు గ్రామస్తులు గంట వెంకన్న, మేరుగు చిరంజీవి, కొంక నరేందర్, అనిల్, మల్లయ్య తదితరులు పాల్గొని తమ ప్రియతమ నేతకు మంత్రి పదవి రావాలని ఆకాంక్షించారు.





అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# నల్గొండ జిల్లాలో ఎండల తీవ్రత

## వడదెబ్బ నివారణకు కలెక్టర్ యాక్షన్ ప్లాన్

## మధ్యాహ్నం 12 నుండి 4 వరకు జాగ్రత్త

## అధికారులకు కీలక ఆదేశాలు

## వడదెబ్బపై యుద్ధ ప్రాతిపదికన అవగాహన కల్పించాలని సూచన

## జిల్లా కలెక్టరేట్ లో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

అధిక ఉష్ణోగ్రతల కారణంగా జిల్లాలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండేలా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. ఇందుకుగాను తక్షణమే పడగాలపులపై జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. వడగాల్పుల పై శుక్రవారం అయన జిల్లా అధికారులు, తహసిల్దారులు, ఎంపీడీవోలు తో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వాతావరణ శాఖ ప్రకారం నల్గొండ జిల్లాలో ఏప్రిల్ నుండి జూన్ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ఈ వారంలొనే 41 నుండి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, రాత్రి సమయాలలో ఆకాశం మబ్బులతో కమ్ముకొని ఉంటుందని చెప్పారు. వృద్ధులు, పిల్లలు, గర్భిణీ స్త్రీలు, ఉపాధి కూలీలు, రవాణా రంగంలో పనిచేసే డ్రైవర్లు, మున్సిపల్ సానిటరీ వర్కర్లు, అలాగే పశువులు, పక్షులు అడవులలో ఉండే మృగాలు అధిక ఉష్ణోగ్రతల ప్రభావానికి గురయ్యే ఆస్కారం ఉన్నట్లు తెలిపారు. వీటన్నిటిని దృష్టిలో



ఉంచుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వడగాల్పులపై మున్సిపల్ ,గ్రామస్థాయిలో ఇదివరకే కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కమిటీలు గ్రామాలలోని ప్రజలు వడదెబ్బ కు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని చెప్పారు . మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 వరకు ఎవరు బయట తిరుగువద్దని, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని, తలపై టోపీ ధరించాలని, నీళ్ల బాటిల్ ,ఓఆర్ ఎస్ పాకెట్లు వెంట ఉంచుకోవాలని, అలాగే అన్ని అంగన్వాడీ కేంద్రాలు,పీహెచ్ సి కేంద్రాలలో తగినన్ని ఓ ఆర్ఎస్ ప్యాకెట్లను ఉంచాలని అన్నారు. ప్రతి గ్రామంలో అలాగే పట్టణాలలోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్లలో దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద కూడా చలివేంద్రాలు పెట్టించాలన్నారు .గ్రామ స్థాయిలో పనిచేసే విలేజ్ శానిటేషన్ కమిటీ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 18న గ్రామస్థాయిలో వడగాల్పుల పై అవగాహన శిబిరాలు నిర్వహించాలని, వడదెబ్బ సోకితే ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆలోచించాలని, వడదెబ్బకు గురైనప్పుడు చేయవలసిన, చేయని కూడని వాటిపై అవగాహన కల్పించాలని చెప్పారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఎవరైనా అనారోగ్యం బారిన పడితే వెంటనే డాక్టర్లను సంప్రదించాలని చెప్పారు.వైద్య ఆరోగ్యశాఖ ద్వారా వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా చేయవలసిన, చేయకూడని వాటిపై సమాచారం రూపొందించాలని, వడగాల్పు పులపై ఆర్డీవోలు, తహసిల్దారులు ప్రతిరోజు నివేదిక పంపించాలని, అటవీ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవించకుండా చుట్టుపక్కల గ్రామపంచాయతీలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాలలో ఉన్న పశువుల తోట్లను ఉపయోగంలోకి తీసుకురావాలని, అధిక లోడు కారణంగా ట్రాన్స్ఫార్మర్లు కాలిపోకుండా ముందే అప్రమత్తంగా ఉండాలని, అన్ని అత్యవసర శాఖలు అందుబాటులో ఉండాలని, ప్రత్యేకించి కార్మిక శాఖ ద్వారా కూలీలు పనిచేసే చోట అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, ప్రజలకు వడగాల్పులపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి వడదెబ్బకు గురి కాకుండా చూడాలన్నారు. పత్రికలు, చానళ్లు, సోషల్ మీడియాలో వడ్డదేబ్బపై విస్తృత ప్రచారం కల్పించాలని, అలాగే ప్రజలు వేసవిలో నూనె ఎక్కువగా ఉండే వస్తువులను, వేపుళ్లను తినకుండా సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలని, వదులు దుస్తులు, కాటన్ దుస్తులు వేసుకోవాలని, జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కూడా అవసరమైన ఓ ఆర్ ఎస్ పాకెట్లు, తాగునీరువంటివి ఏర్పాటు చేయాలన్నారు. వడగాల్పులకు సంబంధించిన సమాచారాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 18004251422 లేదా వాట్సాప్ నంబర్ 6305951279 కు తెలియజేయాలని కలెక్టర్ కోరారు. ధాన్యం సేకరణ పై సమీక్షిస్తూ ప్రత్యేక అధికారులు ప్రతిరోజు ధాన్యం సేకరణ ను ప్రవేశించాలని, కొనుగోళ్లతో పాటు, రవాణా పెంచాలని, మిల్లర్లు వెంటవెంటనే ధాన్యాన్ని అన్లోడ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని, ఓపి ఎమ్మెస్ ఎంట్రీస్ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడారు.

# దోనిపాముల గ్రామంలో ఘనంగా 'పోషణ్ పఖ్వాడా'

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అక్షరకలం, చండూరు

నల్గొండ జిల్లా చండూరు మండలం దోనిపాముల గ్రామపంచాయతీ పరిధిలో 'పోషణ్ పఖ్వాడా' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దాసరి అలివేలు స్వామి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ యాదమ్మ గర్భిణీలు, బాలింతలు మరియు తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తూ, మన నిత్య జీవితంలో లభించే తక్కువ ఖర్చుతో కూడిన ఆహార పదార్థాలతోనే ఎక్కువ పోషకాలను ఎలా పొందవచ్చో కూలంకషంగా వివరించారు. ముఖ్యంగా చిరుధాన్యాలు, ఆకుకూరలు మరియు పండ్ల ప్రాముఖ్యతను వివరిస్తూ, పిల్లల ఎదుగుదలలో సరైన ఆహారం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ అశోక్ రెడ్డి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సులోచన తమ సందేశాలను అందిస్తూ గ్రామంలోని ప్రతి బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు జి. నాగలక్ష్మి, సిహెచ్. తారక, ఆయా జి. సైదమ్మలతో పాటు పెద్ద సంఖ్యలో తల్లులు మరియు గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నామినేటెడ్ పదవుల్లో మైనార్టీలకు ప్రాధాన్యత కల్పించాలి

## ---మునుగోడు కాంగ్రెస్ నేత జన్ను డిమాండ్

అక్షరకలం, చండూరు



మునుగోడు నియోజకవర్గంలోని మండలాలు, మున్సిపాలిటీలు మరియు గ్రామ స్థాయిల్లో మైనార్టీ నామినేటెడ్ పదవులను వెంటనే భర్తీ చేయాలని మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకుడు జన్ను పార్టీ అధిష్టానాన్ని కోరారు. పార్టీ గెలుపు కోసం నిరంతరం శ్రమిస్తున్న మైనార్టీ కార్యకర్తలకు, నాయకులకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా నల్గొండ జిల్లా కాంగ్రెస్ కమిటీలో మైనార్టీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న వారికి పదవుల కేటాయింపులో ప్రాధాన్యత ఇచ్చి న్యాయం చేయాలని ఈ సందర్భంగా జన్ను విజ్ఞప్తి చేశారు.

# సాగర్ హైవేపై ఘోర ప్రమాదం

## లారీని ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి

అక్షరకలం దేవరకొండ

నల్గొండ జిల్లా చింతపల్లి మండల పరిధిలో ఘోర రహదారి ప్రమాదం సంభవించింది. హైదరాబాద్ – నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

ప్రమాద వివరాలు:

స్థానికులు మరియు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేపల్లి నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఌా 06 ఎఫ్ సి 1728 నంబర్ గల కారు, పోలేపల్లి రాంనగర్ గేట్




సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. హైదరాబాద్ నుండి మల్లేపల్లి వైపు వెళ్తున్న ఌా 04 ూ= 2372 నంబర్ గల లారీని కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది.ఢీకొన్న వేగానికి కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. కారు నడుపుతున్న వ్యక్తి కారులోనే ఇరుక్కుపోయి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో, చికిత్స నిమిత్తం మాల్లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.ప్రమాదం జరిగిన వెంటనే చింతపల్లి ఎస్సై ముత్యాల రామ్మూర్తి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని అతికష్టంపై బయటకు తీశారు. మృతునికి సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

# కొండమల్లేపల్లి పంచాయతీలో 'చలాన్' చక్రవ్యూహం

## .. 40లక్షల ప్రజాధనం స్వాహా!

నల్గొండ జిల్లా (కొండమల్లేపల్లి):

అవినీతి తిమింగలాలు అడ్డదారులు తొక్కితే ఎలా ఉంటుందో కొండమల్లేపల్లి పశువుల సంత నిధుల వ్యవహారం నిదర్శనంగా నిలుస్తోంది. వందలు, వేలు కాదు.. ఏకంగా 40లక్షల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ నకిలీ చలానాల ద్వారా ఒక భారీ నెట్వర్క్ పనిచేసినట్లు ఆధారాలు లభిస్తున్నాయి.

### కుట్ర వెనుక ఉన్న అసలు మాస్టర్ ప్లాన్ ఏంటి?

పశువుల సంత వేలం ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని కాజేసేందుకు కాంట్రాక్టర్ ఒక వినూత్నమైన మార్గాన్ని ఎంచుకున్నాడు. బ్యాంకులో అసలు డబ్బు కట్టకుండానే, కట్టినట్లుగా నకిలీ ముద్రలు, సంతకాలతో కూడిన చలానాలను సృష్టించి పంచాయతీ రికార్డుల్లో జత చేశాడు.

2025లో: ?20 లక్షల విలువైన రెండు నకిలీ చలానాలు.

**2026 మార్చిలో: ?20లక్షల విలువైన నాలుగు నకిలీ చలానాలు.**

మొత్తం నాలుగు చలానాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన సొమ్ము కాంట్రాక్టర్ జేబుల్లోకి వెళ్లిపోయింది.

స్పెల్లింగ్ మిస్టేక్స్‌తో దొరికిపోయిన 'నకిలీ' ముద్రలు!

ఈ కుంభకోణంలో అత్యంత విస్మయం కలిగించే అంశం




బ్యాంకు స్టాంపులు. నిందితుడు ఎంత ధీమాగా ఉన్నాడంటే, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ బి ఐ) పేరుతో నకిలీ ముద్రలను సృష్టించాడు. అయితే, ఆ ముద్రల్లోని స్పెల్లింగ్ తప్పులను గమనించిన బ్యాంకు అధికారులు, అవి తమవి కావని తేల్చిచెప్పారు. ప్రస్తుతం ఈ నకిలీ స్టాంపులు ఎక్కడ తయారయ్యాయి? దీని వెనుక సూత్రధారులు ఎవరు? అనేది మిస్టరీగా మారింది.

### ఇంచార్జి ఎంపీడీఓ సుదర్శన్ కుమార్ ఏమంటున్నారు?

ఈ వ్యవహారంపై ఎంపీడీఓ స్వయంగా బ్యాంక్ కి వెళ్లి విచారణ జరిపారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి: కాంట్రాక్టర్




ఇచ్చిన నాలుగు చలానాల సొమ్ము బ్యాంకు ఖాతాలో ఎక్కడా కనిపించడం లేదు. వివరణ కోరేందుకు వెళ్తే బ్యాంకు మేనేజర్ అందుబాటులో లేకపోవడం, 15 రోజులుగా బ్యాంకు నుండి లిఖితపూర్వక సమాధానం రాకపోవడం అనుమానాలకు తావిస్తోంది.బ్యాంకు బాధ్యతాయుతంగా వ్యవహరించని పక్షంలో తాము బ్యాకింగ్ అంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించనున్నట్లు ఆయన తెలిపారు.

### నిందితులను కాపాడుతున్న 'అదృశ్య హస్తం' ఎవరిది?

కలెక్టర్ విచారణకు ఆదేశించినా, పత్రికల్లో కథనాలు వచ్చినా.. ఇప్పటివరకు నిందితులపై ఎఫ్.ఐ.ఆర్ నమోదు కాకపోవడం వెనుక ఒక బడా రాజకీయ నాయకుడి ఒత్తిడి ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. స్థానిక అధికారులు "చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం" వెనుక అసలు రహస్యం ఏంటి?.ప్రజాధనాన్ని కాజేయడమే కాకుండా, రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థలను సైతం తప్పుదోవ పట్టించిన ఈ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరగాలి. తక్షణమే నిందితులను అరెస్ట్ చేసి, కాజేసిన 40 లక్షల రూపాయలను రికవరీ చేయాలని కొండమల్లేపల్లి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# చండూరులో టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల నిరసన

అక్షరకలం, చండూరు



టీజీఈజేఏసీ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు చండూరు డివిజన్ పరిధిలోని వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ మరియు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈరోజు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై వినూత్న నిరసన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో రెవిన్యూ డివిజన్ కార్యాలయం మరియు ఎంపీడీవో కార్యాలయాల వద్ద భారీ నినాదాలతో నిరసన కార్యక్రమం నిర్వహించి, అనంతరం ఆర్డీవో శ్రీమతి వి. శ్రీదేవికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెండో పీఆర్సీ కమిషన్‌ను పొడిగించకుండా జూన్ 2 లోపు అమలు చేయాలని, ఉద్యోగులకు రావాల్సిన 13 వేల కోట్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, హెల్త్ కార్డులను అమలులోకి తీసుకురావడంతో పాటు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు 64 దీర్ఘకాలిక అంశాలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ చండూరు యూనిట్ అధ్యక్షులు జి. లింగయ్య, కార్యదర్శి నిఖిల్, ట్రెజరర్ శ్రీకాంత్, ఎంపీడీవోల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి. యాదగిరి, రమాకాంత్ శర్మ, గోన సత్యనారాయణరావు, రాజలింగం, పోల పద్మ, రజిని మరియు వి. నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కారించాలని ఆర్డీవో కు వినతి

యాదాద్రి భువనగిరి అక్షర కలం

దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల, పెన్షన్ దారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టిజీఈ జేఏసీ) అధ్వర్యంలో నిరసన తెలిపి భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి కి వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల కొన్ని సమస్యలు పరిష్కారం అయ్యాయని, ఇంకా కొన్ని సమస్యలు పెండింగ్ లో ఉన్నాయని వాటిని పరిష్కరించాలని గతంలో



ఉన్నత స్థాయి అధికారులకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లామని , సమస్యలు పరిష్కారం జరగని కారణంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగులు కోరారు

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# వారం పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించండి

## -ధాన్యం అన్‌లోడ్ వేగవంతం చేయండి
## రైస్ మిల్లర్లకు జిల్లా కలెక్టర్ ఆదేశం
## రైతులకు అండగా నిలవాలని పిలుపు

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం

రబీ ధాన్యం అన్ లోడ్ ను రైస్ మిల్లర్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం అయన తన ఛాంబర్ లో జిల్లాలోని రైస్ మిల్లర్లు, ధాన్యం సేకరణ కు సంబంధించిన సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.కొనుగోలు కేంద్రాలకు రబీ ధాన్యం పెద్ద ఎత్తున వస్తున్నందున రైస్ మిల్లర్లు జాప్యం చేయకుండా మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెనువెంటనే అన్లోడ్ చేసుకోవాలని ఆదేశించారు. వివిధ కారణాలతో మిల్లుల వద్ద లారీలు అన్లోడ్ కాకుండా నిలిచిపోకూడదన్నారు. రబీ ధాన్యం సేకరణలో మిల్లర్లు రైతుల పక్షాన నిలబడి వారికున్న పూర్తి సామర్థ్యంతో వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లు అన్లోడ్ చేసుకోవాలని కోరారు. జిల్లాలో ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలలో సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందని, మరో 15 రోజుల్లో మరో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున మిల్లర్లు పూర్తి సామర్థ్యంతో పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. తాలు, లారీలు తదితర కారణాలతో ఎలాంటి కొర్రీలు విధించకుండా ధాన్యాన్ని దించుకోవాలని, ఈ విషయంలో రైతులకు పూర్తి సహకారం



అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి నోటిఫైడ్ లారీలను ఏర్పాటు చేయమని పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ను ఆదేశించారు. ఈ విషయంలో మిల్లర్లతో పాటు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సహకరించాలన్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు పంపించేందుకు పూర్తిస్థాయిలో లారీలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిల్లర్ల సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, బ్యాంకు గ్యారెంటీ, మిల్లర్ అగ్రిమెంటు సమర్పించని మిల్లర్లు తక్షణమే ఇవ్వాలని ఆదేశించారు. ధాన్యం సేకరణలో ఎట్టి పరిస్థితులలో రైతులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించవద్దని ఆయన తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు, వర్ష సూచనలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాలకు వచ్చిన దాన్యం తడవకుండా, పాడవకుండా ముందుగానే కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ధాన్యం లోడింగ్ లో ఒకే వెరైటీని మాత్రమే లోడ్ చేసి పంపించాలని, "ఏ" గ్రేడ్ ధాన్యంతో కామన్ వెరైటీలు కలిపి పంపించకూడదని చెప్పారు. ఇప్పటివరకు ఆయా మిల్లుల వారిగా దిగుమతి చేసుకున్న ధాన్యం వివరాలపై నివేదిక ఇవ్వాలని జిల్లా పౌర సరఫరాల అధికారిని కలెక్టర్ ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదికన వారం రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ధాన్యం అన్లోడింగ్ వేగవంతం చేయాలని చెప్పారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, రబీ ధాన్యం సేకరణ పై మిల్లర్లకు పలు సూచనలు చేశారు. పౌరసరఫరాల జిల్లా అధికారులు వెంకటేశం, రామ్ పతి నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డి సి ఓ పత్యా నాయక్ ,జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

# ఎండల తీవ్రతపై అప్రమత్తం

## నల్గొండలో 'హీట్ వేవ్ కంట్రోల్ రూమ్' ఏర్పాటు
## కమిషనర్ శరత్ చంద్ర



అక్షరకలం నల్లగొండ

రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వేడి గాలుల నేపథ్యంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నల్గొండ నగరపాలక సంస్థ కీలక చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా 'హీట్ వేవ్ కంట్రోల్ రూమ్' ఏర్పాటు చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ శరత్ చంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వేసవి తాపం వల్ల తలెత్తే ఇబ్బందులు లేదా అత్యవసర పరిస్థితులపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు, సమాచారం పొందేందుకు ప్రత్యేక నంబర్లను కేటాయించారు. టోల్ ఫ్రీ నంబర్: 1800 425 1422 ?వాట్సాప్ నంబర్: 63059 51279 ను ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఉదయం 06:00 నుండి రాత్రి 10:00 గంటల వరకు. ?మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సహాయక చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. నగర ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు కమిషనర్ పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన కూడళ్లలో తాగునీరు, శీతల నీటి పాయింట్లు ఏర్పాటు. ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద వాహనదారుల కోసం తాత్కాలిక షెడ్ల ఏర్పాటు. పేద వర్గాల కోసం ఆశ్రయ కేంద్రాలు, ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణ. ?తీవ్రమైన ఎండల దృష్ట్యా ప్రజలు కింది జాగ్రత్తలు పాటించాలని కమిషనర్ కోరారు. ?మధ్యాహ్నం 12:00 నుండి 3:00 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు. ?శరీరంలో నీటి శాతం తగ్గకుండా తరచూ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు సేవించాలి. ?చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఎండ పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలి. ?నీరసం, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ?వార్డు అధికారులు, సానిటరీ సిబ్బంది ఈ కంట్రోల్ రూమ్ నంబర్లపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా కమిషనర్ ఆదేశించారు. అత్యవసర సమయాల్లో ప్రజలు కంట్రోల్ రూమ్ సేవలను వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మహిళా డిగ్రీ కళాశాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన



అక్షరకలం నల్లగొండ

టీజీఈజేఏసీ రాష్ట్ర కార్యవర్గ నిర్ణయం, జేఏసీ చైర్మన్ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి ఆదేశాల మేరకు, తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ, నల్గొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) లో భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు.?ఈ సందర్భంగా ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుంకరి రాజారామ్ మాట్లాడుతూ.. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న జాప్యాన్ని ఎండగట్టారు.51 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని పి హెచ్ ఎస్ అమలు చేయాలని,పెండింగ్ బిల్లులు ఏకకాలంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ ప్రకారం సి.పి.ఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు జేఏసీ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# మైనంపల్లిలో 'నో హెల్మెట్ - నో ఎంట్రీ'

## సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ వినూత్న ప్రచారం

అక్షరకలం దేవరకొండ

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా మైనంపల్లి గ్రామం సరికొత్త నిబంధనను అమల్లోకి తెచ్చింది. "నో హెల్మెట్ – నో ఎంట్రీ" నినాదంతో గ్రామంలోకి వచ్చే వారు, గ్రామం నుండి వెళ్లే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ స్పష్టం చేశారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రాణ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని కోరారు. కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న పలువురు వాహనదారులకు సర్పంచ్ సొంతంగా హెల్మెట్లను పంపిణీ చేసి తమ ఉదారతను చాటుకున్నారు. "మీ ప్రాణం మీ కుటుంబానికి ముఖ్యం, హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాల నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి" అని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సామాజిక చైతన్య కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్, మాజీ ఉప సర్పంచ్ వెంకట్, భాగ్యలక్ష్మి, జగదీష్, అంగన్వాడీ టీచర్ కమిలి, లచ్చి, బుజ్జి, కలమ్మ, ఆశ కార్యకర్త ధనమ్మ పాల్గొన్నారు.కాగా గ్రామ అభివృద్ధి ప్రజల భద్రత కోసం సర్పంచ్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని గ్రామస్తులు, ప్రయాణికులు హర్షిస్తున్నారు. హెల్మెట్ లేనిదే గ్రామంలోకి ప్రవేశం లేదనే నిబంధనతో మైనంపల్లి ఇప్పుడు ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది.



# తాటికోల్ వాగులో అనుమతి లేదు

## అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు
## దేవరకొండ సీఐ వెంకట్ రెడ్డి

అక్షరకలం దేవరకొండ



నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలించినా లేదా మైనర్లకు వాహనాలు ఇచ్చినా చట్టపరమైన చర్యలు తప్పవని దేవరకొండ సీఐ వెంకట్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం దేవరకొండ మండలంలోని తాటికొల్ గ్రామంలో ట్రాక్టర్ యజమానులు, గ్రామ పెద్దలతో ఆయన ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, తాటికొల్ వాగు నుండి ఇసుక తరలించడానికి ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. అనుమతి లేని ప్రాంతాల నుండి ఇసుకను తరలిస్తూ పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు, యజమానులపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ సంపదను కొల్లగొడితే సహించేది లేదని ఆయన పేర్కొన్నారు.

### మైనర్ డ్రైవింగ్‌పై సీరియస్...

రోడ్డు ప్రమాదాల నివారణపై మాట్లాడుతూ, మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని సీఐ తెలిపారు.పదిహేనేళ్ల లోపు పిల్లలకు ట్రాక్టర్లు లేదా ద్విచక్ర వాహనాలు ఇస్తే, ప్రమాదాలు జరిగినప్పుడు పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులను కూడా బాధ్యులను చేస్తూ కేసులు నమోదు చేస్తామన్నారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, లైసెన్స్ ఉన్న వారు మాత్రమే వాహనాలను నడపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తాటికొల్ గ్రామ పెద్దలు, యువకులు, ట్రాక్టర్ యజమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా, చట్టానికి లోబడి నడుచుకోవాలని సీఐ వారికి దిశానిర్దేశం చేశారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వసతులు కల్పించాలి --వినోద్ నాయక్ (ఓయూ) డిమాండ్

అక్షరకలం దేవరకొండ

స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై జనసేన విద్యార్థి విభాగం ఓయూ అధ్యక్షుడు, రాష్ట్ర అడ్ హాక్ కమిటీ సభ్యుడు వినోద్ నాయక్ (ఓయూ) ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన కార్యాలయ అధికారులను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండలు మండుతున్నా కార్యాలయంలో కనీసం మంచినీటి సౌకర్యం లేకపోవడం దారుణమన్నారు. ప్రజలు కూర్చోవాల్సిన చోట ఉద్యోగులు తమ బైక్లను పార్క్ చేయడం వల్ల వృద్ధులు, సామాన్యులు ఎండలో నిలబడాల్సి వస్తుందని మండిపడ్డారు.



### --ప్రధాన డిమాండ్లు....

ఆఫీసు లోపల ఉద్యోగుల వాహనాల పార్కింగ్‌ను నిలిపివేసి, ఆ స్థలాన్ని ప్రజలకు కేటాయించాలిపెరుగుతున్న ఎండ దృష్ట్యా తక్షణమే వాటర్ కూలర్లు ఏర్పాటు చేయాలి. వెయిటింగ్ హాల్‌లో ఫ్యాన్లు, బయట చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి. అధికారులు వెంటనే స్పందించకపోతే జనసేన విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో కార్యాలయాన్ని ముట్టడిస్తామని వినోద్ నాయక్ హెచ్చరించారు.

# రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఉద్యోగుల నిరసన...

## ఉద్యోగులకు రావాల్సిన డిఏలు, పిఆర్సి వెంటనే విడుదల చేయాలి...
## పాత పెన్షన్ పద్ధతి అమలు చేయాలని డిమాండ్...



అక్షర కలం నాగార్జునసాగర్/ నందికొండ

తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శుక్రవారం నాడు రాష్ట్ర కార్యదర్శి వాడపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో బ్రాంచి అధ్యక్షురాలు కిరణ్ కుమారి , కార్యదర్శి రాము నిర్వహణలో హాజరు సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వశీ, ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన పిఆర్సి, ఐదు డీ. ఎ.లు పెండింగ్ లో ఉంచడం, రిలీజ్ చేయకపోవడం మరియు కాంట్రిబ్యూటర్ సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయమని, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి నెరుగ వారికి జీతాలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు కాంట్రాక్టు ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్పి ఉద్యోగుల దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ ఇచ్చిన విధంగా సత్వరమే పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎస్పి ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ నాయక్ డాక్టర్ జోగేందర్ ,డాక్టర్ చక్రవర్తి డాక్టర్ ,అనిత రాణి , ఫిజియోథెరపీ డాక్టర్ సోమశేఖర్ , వైద్యశాల సిబ్బంది నర్సింగ్ ఆఫీసర్స్ , ఎన్ఎస్పి అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

# నందికొండ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బిజెపి ఎంపీ తేజస్వి సూర్య దిష్టిబొమ్మ దహనం..

అక్షర కలం నాగార్జునసాగర్ / నందికొండ

హిల్ కాలనీలోని నాగార్జునసాగర్ హైదరాబాద్ ప్రధాన రహదారిపై బిజెపి ఎంపీ తేజస్వి సూర్య లోక్ సభలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు.లోక్ సభలో తెలంగాణరాష్ట్ర ఏర్పాటును భారత్-పాక్ విభజనతో పోలుస్తూ బిజెపి ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర దుమారం లేపాయి. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడిన ఆయనపై నిరసనలు వెల్లువెత్తాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్ తో పోల్చడం ద్వారా తెలంగాణ రాష్ట్ర ఉనికిని, అమరవీరుల త్యాగాలను అవమానించారని,వేలమంది బలిదానాలతో సిద్ధించిన తెలంగాణ రాష్ట్రాన్ని అగౌరవపరిచేలా మాట్లాడటం తేజస్వి సూర్య అజ్ఞానానికి నిదర్శనమని నందికొండ బిఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. ఆయన వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ కౌన్సిలర్ హీరేకర్ రమేష్ జి, నందికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ ముఖ్య సలహాదారుడు ఆదాసు విక్రం,1వ వార్డు ఇంచార్జ్ పమ్మి జనార్దన్ రెడ్డి, 2 వ వార్డు ఇంచార్జ్ మహమ్మద్ గని, 4వ వార్డు ఇంచార్జ్ విజయ్,6 వా వార్డ్ ఇంచార్జ్ చంద్రమౌళి నాయక్, 10 వ వార్డ్ ఇంచార్జ్ కోడా విజయ్, అర్జున్ నాయక్, లక్ష్మణ్ నాయక్, శేఖరా చారి, మన్సూర్, రవి, నజీర్, భూయాకర్ శివ, పిట్ట సైదులు , దార రవి, తదితరులు పాల్గొన్నారు.



# టిఆర్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ గా పారనంది పరమేశ్వర్

**మందమర్రి, ఏప్రిల్ 17 అక్షర కలం:**



టిఆర్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ గా పట్టణానికి చెందిన పారనంది పరమేశ్వర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కర్నంగి మత్స్యరాజు, నేషనల్ డైరెక్టర్ రావుల తిరుపతయ్య లు శుక్రవారం పరమేశ్వర్ కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన అసోసియేషన్ జాతీయ, రాష్ట్ర, నాయకులకు, సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మానవ హక్కుల పరిరక్షణకు, అవినీతికి వ్యతిరేకంగా సంఘాన్ని బలోపేతం చేస్తూ, ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# భక్తులకు సౌకర్యంగా పుష్కర ఘాట్లు ఏర్పాటు చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య**

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 17:**



గోదావరి పుష్కరాలు-2027 లో భాగంగా భక్తులకు సౌకర్యవంతంగా పుష్కర ఘాట్లు ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూరు పట్టణంలో గల పుష్కర్ ఘాట్ వద్ద భక్తులకు సౌకర్యవంతమైన వసతులు కల్పించే దిశగా చేపడుతున్న పనులను తహశీల్దార్ మల్లికార్జున్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్, చెన్నూరు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ పెద్దింటి పద్మ, వైస్ చైర్‌పర్సన్ నాయకపు వినయ్ కుమార్, కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య మాట్లాడుతూ, పుష్కర్ ఘాట్‌కు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ సౌకర్యాలు విస్తరించాలని, వాహనాల రాకపోకలు సులభంగా జరిగేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఘాట్ పరిసర ప్రాంతాలలో శుభ్రత, తాగునీరు, లైటింగ్, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, దేవాలయ ప్రాంతాల్లో శుభ్రత, ఆలయ అభివృద్ధి, భక్తులకు సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సాధించాలని తెలిపారు. అనంతరం అక్కేపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. నర్సరీ, ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం, ఇందిరమ్మ ఇండ్లు, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, గోశాలలను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. గ్రామాభివృద్ధి పనులు నాణ్యతతో, సమయానికి పూర్తయ్యేలా పర్యవేక్షించాలని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో పిల్లలకు సరైన వసతులు కల్పించడంతో పాటు పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసి, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# దరఖాస్తులు పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 17:**



మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూమి అభివృద్ధిలో భాగంగా వెంచర్ల ఏర్పాటు కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హాజీపూర్ మండలం వేంపల్లి, మంచిర్యాల పట్టణంలోని రాజీవ్ నగర్ ప్రాంతాలలో వెంచర్ ఏర్పాటు కొరకు అందిన దరఖాస్తులకు సంబంధించి భూమిని హాజీపూర్ మండల తహశీల్దార్ పుష్పలత, పట్టణ ప్రణాళిక అధికారి సంపత్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, నగర అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వెంచర్ల కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను సరిచూసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గోల్డెన్ అవర్‌లో మానవత్వంతో బాధితులకు సహాయం చేయాలి:

**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్ 17)**



'అరీవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా, రోడ్డు ప్రమాదాలు నివారించడానికి బాధితులకు త్వరిత సేవలు అందించేందుకు అంబులెన్స్ డ్రైవర్లు, యువత, వాహనదారులకు మరికల్ సీఐ భగవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మరికల్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ భగవంత్ రెడ్డి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారిని లేదా గుండెపోటుతో బాధపడుతున్నవారిని 'గోల్డెన్ అవర్'లోపు మానవత్వంతో స్పందించి, సిపిఆర్ చేసి వెంటనే ఆసుపత్రికి తరలిస్తే ఒక ప్రాణాన్ని కాపాడినవారిగా నిలుస్తారని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి బాధితులను సమీప ఆసుపత్రికి చేర్చడం ద్వారా ప్రాణాపాయం తప్పించవచ్చని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో సమాచారం ఇచ్చిన వ్యక్తులపై ఎలాంటి కేసులు లేదా విచారణలు ఉండవని స్పష్టం చేశారు. సహాయం చేసినవారిని ఎలాంటి ఇబ్బందులకు గురిచేయబోమని తెలిపారు. అదేవిధంగా, ఆపదలో సహాయం చేసిన మంచి మనసున్న వ్యక్తులను ప్రభుత్వం ప్రోత్సహిస్తూ నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తుందని వెల్లడించారు. ప్రజలు, ముఖ్యంగా యువత, వాహనదారులు బాధ్యతగా స్పందించి, ప్రమాదాల సమయంలో వెంటనే సహాయం చేసి ప్రాణాలను కాపాడే సేవలో భాగస్వాములు కావాలని సీఐ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీందర్ రెడ్డి, మరికల్ ఎస్ఐ-2 మహేశ్వరి, పోలీస్ సిబ్బంది, యువకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

# ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

**సోమవారం నుండి పోరాటం మరింత ఉధృతం**

**పూర్తి బాధ్యత సింగరేణి అధికారులు, మంత్రి వివేక్**

**ఎస్సీకెఎస్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్**

**మందమర్రి, ఏప్రిల్ 17 అక్షర కలం:**

గత రెండు నెలలకు పైగా ఉపాధి కోల్పోయి, ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్న ఏరియాలోని ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల సమస్యను పరిష్కరించి, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో సోమవారం నుండి పోరాటం మరింత ఉధృతంగా నిర్వహిస్తామని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ స్పష్టం చేశారు. సెక్యూరిటీ గార్డులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు చేస్తున్న పోరాటం శుక్రవారం నాటికి 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఏరియాలోని శాంతిఖని గని లాంగ్ వాల్ ప్రాజెక్టు వద్ద సెక్యూరిటీ గార్డులు ప్లకార్డులు ధరించి, శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్మికులు చేస్తున్న పోరాటానికి ప్రజల తో పాటు కార్మికులు,



ప్రజాసంఘాల నుండి పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా మద్దతు లభిస్తుంది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల విషయంలో సింగరేణి అధికారులు చూపిస్తున్న నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా రోజురోజుకు ప్రజల నుండి కార్మిక వర్గం నుండి సింగరేణి గుర్తింపు సంఘంతో పాటు వివిధ కార్మిక సంఘాల నుండి స్వచ్ఛందంగా మద్దతు పలకడానికి రావడం యాజమాన్యం మొండి వైఖరికి, కార్మికులు న్యాయమైన పోరాటానికి ఉదాహరణ అని తెలిపారు. యాజమాన్యం తన అవసరాలకు బుజ్జగిస్తూ, అవసరం తీరిన తర్వాత రోడ్డు మీద పడేసే తీరు ప్రస్తుతం ప్రజల్లో చర్చనీయాంశంగా మారుతుందన్నారు. రేపటి రోజుల్లో సింగరేణి మనుగడ కోసం భూసేకరణ అవసరమైతే ఈ ప్రజలకు ఏమని సమాధానం చెబుతుందో సింగరేణి యాజమాన్యం ఆలోచించుకోవాలని సూచించారు. గత 12 సంవత్సరాలుగా పనిచేస్తున్న 220 కుటుంబాల పొట్టలు కొట్టడంలో వెనుకాడని సింగరేణి అధికారులు, రాబోయే రోజుల్లో ఇంకా ఎలాంటి పరిణామాలు చేస్తారనే సందేహాలు, అనుమానాలు సైతం సర్వత్ర వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సమస్యను వెంటనే పరిష్కరించి, కార్మికులందరినీ యధావిధిగా పాత పద్ధతిలో విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సోమవారం నుండి పోరాటాన్ని మరింత ఉధృతంగా ముందుకు తీసుకుపోతామని స్పష్టం చేశారు. దీనికి సింగరేణి అధికారులు, అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే సురక్షితంగా ఇంటికి

**మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్**

**టోల్ ప్లాజా వద్ద రోడ్డు భద్రత, గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతపై అవగాహన**

**వినూత్నంగా యమధర్మరాజు, చిత్రగుప్తుని వేషధారణలో ప్రజలకు అవగాహన**

**మందమర్రి, ఏప్రిల్ 17 అక్షర కలం:**





వాహనదారులు రహదారి భద్రత నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తే సురక్షితంగా ఇంటికి చేరుకోవచ్చునని మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని జాతీయ రహదారి టోల్ ప్లాజా వద్ద రోడ్డు భద్రత, గోల్డెన్ అవర్, సిపిఆర్ పై నిర్వహించిన ప్రత్యేక శిక్షణ అవగాహన కార్యక్రమానికి మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్, పలువురు వైద్యులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల బాధ్యతపై ముఖ్యమైన సూచనలు చేశారు. అనంతరం వైద్య నిపుణులు సిపిఆర్ చేసే విధానాన్ని ప్రాక్టికల్ గా చూపించి, ప్రజలకు, డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. అదేవిధంగా ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన అత్యవసర చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిసిపి భాస్కర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని గోల్డెన్ అవర్ ఎంతో కీలకమని వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే మొదటి ఒక గంటలో సరైన వైద్య సహాయం అందితే ప్రాణాలు కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. డ్రైవర్లు, ప్రయాణికులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రమాదం జరిగినప్పుడు బాధితులను వెంటనే సమీప ఆసుపత్రి తరలించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు. రోడ్డు ప్రమాద సమయంలో ప్రాణాలు కాపాడటంలో సిపిఆర్ ప్రాముఖ్యతను వివరించి, గుండె ఆగిపోయినప్పుడు లేదా శ్వాస ఆగిపోయినప్పుడు వెంటనే సిపిఆర్ చేయడంతో బాధితుడి ప్రాణాలు కాపాడే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా టోల్ ప్లాజా వద్ద వాహనదారులకు, ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, ప్రాణం విలువపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు వినూత్నంగా యమధర్మరాజు, చిత్రగుప్తుని వేషధారణలో ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే ఎదురయ్యే ప్రమాదాలు, ప్రాణ నష్టం గురించి స్పష్టంగా వివరించారు. అనంతరం డిసిపి చేతుల మీదుగా రోడ్డు పక్కన గల షాప్ కీపర్స్, డ్రైవర్లకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సిఐ పర్సా రమేష్, సర్కిల్ పరిధిలోని ఎస్ఐ లు గోపతి నరేష్, ఆంజనేయులు, శ్రీధర్, గంగారం, వైద్యులు డాక్టర్ సిద్దార్థ్, డాక్టర్ శైలేష్, టోల్ ప్లాజా సిబ్బంది, పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు, వాహనదారులు, ప్రజలు పాల్గొన్నారు.

# వేసవి దృష్ట్యా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలి.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 17:**





వేసవి అయినందున వడదెబ్బ తగలకుండా పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో గల 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అవుట్ పేషంట్ రిజిస్టర్, మందుల నిల్వలు, ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వేసవి అయినందున వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, వేసవి దృష్ట్యా వడదెబ్బ విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆసుపత్రిలో కొనసాగుతున్న పోస్టుమార్టం పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యను పరిశీలించి మరింత పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. వంటశాలను సందర్శించి విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న యుడిఐడి కార్డులను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి:ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డిసుధీర్ రెడ్డీ :

**హైదరాబాద్ : ఏప్రిల్ 17,( అక్షర కలం న్యూస్ ):**



దివ్యాంగులు యూడిఐడి కార్డులను సద్వినియోగం చేసుకోవాలి అని ఎల్బీనగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తమ పార్టీ క్యాంపు కార్యాలయంలో జరిగిన యూడిఐడి కార్డుల పంపిణి కార్యక్రమం సుధీర్ రెడ్డి తమ చేతుల మీదుగా పలువురు దివ్యాంగులకు పంపిణి చేయడం జరిగింది. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ అంగవైకల్యంతో బాధపడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న యుడిఐడి కార్డులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైతన్యపూరి డివిజన్ యువ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి,శివప్రకాష్,గ్రేటర్ హైదరాబాద్ దివ్యాంగుల అధ్యక్షులు మందా బిక్షపతి యాదవ్,ఎల్బీనగర్ మహిళా అధ్యక్షురాలు వర్కాల భాగ్యలక్ష్మి,సిద్ధం నర్సింగ్,పద్మ,వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గౌరవం పై రాజీ పడేది లేదు

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 17;**



తెలంగాణ గౌరవం పై ఎటువంటి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. పార్లమెంట్ లో తెలంగాణ రాష్ట్రాన్ని అవమానించేలా చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ అంశంపై శుక్రవారం రాష్ట్రానికి చెందిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ఆయన లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ తేజస్వి సూర్య చేసిన వాఖ్యలను ఖండిస్తూ, వాటిని పార్లమెంట్ రికార్డుల నుండి వెంటనే తొలగించాలని స్పీకర్ ని కోరారు. స్పందించిన స్పీకర్ ఈ విషయాన్ని గంభీరంగా పరిగణించి, ఆ వాఖ్యాలు తగవని అంగీకరించి, వాటిని రికార్డుల నుండి తొలగిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అనేక బలిదానాలు, పోరాటాల ఫలితమని, అలాంటి రాష్ట్ర గౌరవాన్ని దెబ్బతీసే వాక్యాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడటం తమ బాధ్యత అని, రాష్ట్ర హక్కుల కోసం ఢిల్లీ వేదికగా ఎల్లప్పుడూ పోరాడుతామని తెలిపారు.

# వేసవి కాలము దొంగలతో జాగ్రత్త...

- ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు శ్రేయస్కరం....

- అనుమానిత వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలి....

- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు.....

మెదక్ /కొల్చారం ఏప్రిల్ 17(అక్షర కలం):-



పట్టపగలు దొంగలు తిరుగుతున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానంగా కనిపించిన వ్యక్తులను గుర్తించాలని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వేసవి కాలం సెలవులు ప్రారంభం అవుతున్న వేళ పెళ్లి ముహుర్తాలు,స్నేహితులతో, ఫ్యామిలీ మెంబర్స్ తో అంతా టూర్ ప్లాన్ చేస్తూ ఉంటారు. ఇదే అదునుగా దొంగతనాలకు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని జిల్లా ప్రజలు కూడా ఈ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. దొంగతనాల నియంత్రణ కోసం జిల్లా ప్రజలు ఈ దిగువ తెలియజేసిన నిబశీధనలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించగలరు.

# రైతులు పండించిన ప్రతి గింజను కొంటాం

చిన్నకోడూరు లో మూతపడిన రైతు బజారును సందర్శించి

వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు

ఏఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్



అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 17:

ఈ రోజు చిన్నకోడూరు మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం చిన్నకోడూరు లో మార్కెట్ కమిటీ నిధులతో నిర్మించిన రైతు బజారు గత కొంతకాలంగా మూతపడిన విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మీసం మహేందర్ పాలకవర్గం తో కలిసి సందర్శించి వేంటనే వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కన్నారెడ్డి,వార్డ్ మెంబర్స్ రఘు, ఏఎంసీ వైస్ చైర్మన్ బుస్సా రాజశేఖర్, డైరెక్టర్లు నముండ్ల వినోద్,ఎం సలీమ్, ద్యావ కర్ణాకర్, అనుపాటి విజయ రెడ్డి,రాజ వర్ధన్ రెడ్డి,మశిరెడ్డి మహిపాల్ రెడ్డి, రాగుల అశోక్, సింగిరాల లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు సందెబోయిన పర్శరాములు, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ రాజేష్,గొట్టిపర్తి చందు, నక్కరాజు, సీసీలు కొమురయ్య వైకుంఠం సిఏలు హమాలి సంఘం అధ్యక్షులు రైతులు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

# నలుమాల నవిన్ కు "దళిత రత్న" పురస్కారం

నర్మేట సర్పంచ్ శనిగరం స్వాతి బాబు, గ్రామ ప్రజల అభినందనలు



అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 17:

నంగునూరు మండలం నర్మేట గ్రామానికి చెందిన నలుమాల నవిన్ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రతిష్టాత్మకమైన "దళిత రత్న" పురస్కారాన్ని అందుకోవడం పట్ల నర్మేట గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ శనిగరం స్వాతి బాబు మాట్లాడుతూ నలుమాల నవిన్ చిన్న వయసులోనే బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం అభినందనీయమన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం నవిన్ చేస్తున్న కృషికి ఈ అవార్డు తగిన గుర్తింపు అని అభివర్ణించారు. భవిష్యత్తులో నవిన్ మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని, తన సేవా గుణంతో గ్రామానికి మరింత మంచి పేరు తీసుకురావాలని సర్పంచ్ శనిగరం స్వాతి బాబు ఆకాంక్షించారు. నలుమాల నవిన్ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా సమాజ సేవలో ముందుండి పనిచేస్తానని, ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి కట్ట రోజా ఎల్లయ్య, వార్డు మెంబర్లు చేర్యాల మల్లేశం, వేల్పుల తిరుపతి, మాజీ వార్డు మెంబర్లు ముడికే పర్శరాములు, బోదాసు కనకయ్య, నార్లపురం రాజు, మంకాల నర్సింలు, జర్నలిస్ట్ ముష్మీర్ పర్శరాములు మరియు వేల్పుల నర్సింలు, లింగంపల్లి కిష్టయ్య, కట్ట శ్రీనివాస్, గట్టు బాలయ్య, చేర్యాల పర్శరాములు, బొజ్జ రమణతం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జెనోమిక్స్ అగ్రి జెనెటిక్స్ కంపెనీ వారి 305 మొక్కజొన్న పంటపై రైతులకు అవగాహన సదస్సు

అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 17:

నంగునూర్ మండలం వెంకటాపుర్ గ్రామంలో పిల్లి శ్రీనివాస్ మక్కా చేనులో జెనోమిక్స్ అగ్రి జెనెటిక్స్ కంపెనీ వారి +ఇ305?? రైతు అవగాహన సదస్సు నిర్వహిచడం జరిగింది. కంపెనీ అధికారీ నాగరాజు మాట్లాడుతూ బెండు సన్నగా ఉండడం వల్ల మక్కాలు అధికంగా దిగుబడి వస్తున్నదని.వేరు వేవస్థ గట్టిగా ఉండడం వల్ల గాలి వానకు పడిపోకుండా ఉంటుందని అదె విధంగా జెనోమిక్స్ కంపెనీ లో మక్కా వడ్లు పత్తి లో రైతులకు మెలుకువలు చెప్పడం జరిగింది. రైతులందరూ జెనోమిక్స్ మక్కాలు వడ్లు మరియు పత్తి వేసి అధిక దిగుబడి పొందాలని కోరుకుంటూ ఈ కార్యక్రమంలో కంపెనీ డీలర్ కృష్ణమూర్తి,రైతులు తిరుపతి రెడ్డి కిరణ్రెడ్డీ,హరీష్,రవీందర్ రెడ్డి బుచ్చిరెడ్డి,నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.



# పంచాయతీరాజ్ చట్టంలో నిబంధనలకు లోబడి గ్రామ పాలన కొనసాగాలి కలెక్టర్.....

- ప్రతి సర్పంచ్ గ్రామానికి లీడర్ గా వ్యవహరించాలి.....

- సమ్మర్ యాక్షన్ ప్లాన్ తో గ్రామాలలో డ్రింకింగ్ వాటర్ సమస్యలను నిర్మూలించాలి....

- ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ సమన్వయంతో గ్రామంలో సుపరిపాలన అందించాలి....

- 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై సర్పంచులు పంచాయతీ కార్యదర్శులకు వర్క్ షాప్ నిర్వహణ.....

- గ్రామాల్లో సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలి.....

- మెదక్ జిల్లా కలెక్టర్





ప్రతిమాసింగ్.....

మెదక్ /కొల్చారం ఏప్రిల్ 17(అక్షర కలం):-

పంచాయతీరాజ్ చట్టంలో నిబంధనలకు లోబడి గ్రామ పాలన కొనసాగాలని.ప్రతి సర్పంచ్ గ్రామానికి లీడర్ గా వ్యవహరిం. చాలని. సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా గ్రామాలలో నీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో సర్పంచులు ,పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలు, కంప్యూటర్ ఆపరేటర్లకు 15 ఆర్థిక సంఘం నిధుల వినియోగం పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో 15 వ ఆర్థిక సంఘం నిధులు సక్రమంగా వినియోగించి గ్రామా అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలన్నారు. జిల్లాలోనిగ్రామపంచాయతీలు మోడల్ గా తీర్చిదిద్దాలని, గ్రామాలలో అన్ని రకాల మౌలిక వసతులపై దృష్టి సారించాలన్నారు, అంగన్వాడీ బిల్డింగ్స్, జిపి బిల్డింగ్స్ లేని గ్రామాలకు నూతన బిల్డింగ్స్ ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.. ప్రత్యేక అధికారి, పంచాయతీ సెక్రెటరీ సర్పంచ్ సమన్వయంతో గ్రామ పంచాయతీలో పనులు సవ్యంగా నడవాలన్నారు. గ్రామాల్లో సమస్యలు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని 15 ఆర్థిక సంఘం నిధులను అన్ని గ్రామాలకు ప్రభుత్వం అందించిందని ,వాటితో గ్రామాల్లో సమస్యలు లేకుండా ఇతర శాఖల అధికారుల సమన్వయంతో పని చేయాలన్నారు. నిధుల వినియోగం లో అక్రమాలకు తావులేదన్నారు. నిధులు సక్రమంగా వినియోగించక పోతే ,అక్రమాలు జరిగితే సర్పంచ్ , కార్యదర్శుల పై చర్యలకు వెనకాడబోమని హెచ్చరించారు. గ్రామాల్లో త్రాగు నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య ఈ.ఈ మిషన్ భగీరథ ఇంట్రా సంపత్ కుమార్, గ్రిడ్ డి.ఈ నాగభూషణం,డిఎల్పిఓలుసాయి బాబు, తిరుపతి రెడ్డి ,అధికారులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రబి-యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలి: అదనపు కలెక్టర్ మాధురి .

సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..





జిల్లాలో రబి-యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏపీఎంలు, ప్యాక్స్ సెక్రటరీలు, వ్యవసాయ అధికారులు, పీపీసీ, ఐకేపీ సెంటర్ల ఇన్‌చార్జిలు, తూనికలు కొలతల శాఖ అధికారులు, రవాణా శాఖ అధికారులు, సహకార శాఖ అధికారులు,ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు,ఇతర సంబంధిత శాఖల అధికారులతో కలిసి యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ .... జిల్లాలో 2025-26 రబీ సీజన్‌లో మొత్తం 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. ఇందులో దొడ్డురకం ధాన్యం 2 లక్షల మెట్రిక్ టన్నులు, సన్నరకం ధాన్యం 20 వేల మెట్రిక్ టన్నులు ఉండనున్నాయని వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ప్రకారం గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,389, కామన్ రకానికి రూ.2,369 నిర్ణయించినట్లు తెలిపారు. సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,389, అదనంగా రూ.500 బోనస్ తో రూ . 2,889 లు , అందించనున్నట్లు తెలిపారు . రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల కోసం మొత్తం 226 కొనుగోలు కేంద్రాలు ప్రతిపాదించినట్లు వెల్లడించారు. వీటిలో ఐకేపీ ఆధ్వర్యంలో 97, ప్యాక్స్ ఆధ్వర్యంలో 97, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 31, ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో ఒక కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో తార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ తూకపు యంత్రాలు, తేమ కొలిచే మీటర్లు వంటి మౌలిక సదుపాయాలు సరిపడా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సెంటర్ నిర్వాహకులు ప్రతిపాదించిన రైస్ మిల్లర్లకు మాత్రమే ధాన్యాన్ని లారీల ద్వారా తరలించాలని, సొంత రవాణా వాహనాలు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. గతంలో తలెత్తిన లోటుపాట్లను సరిచేసుకుని ఈసారి పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని అన్నారు. ఆన్లైన్ ట్యాబ్ నమోదు ప్రక్రియలో ఆలస్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులకు సీరియల్ నంబర్లు కేటాయించాలని పేర్కొన్నారు . అకాల వర్షాల సమయంలో ధాన్యాన్ని రక్షించే బాధ్యత సెంటర్ ఇన్‌చార్జిలదేనని హెచ్చరించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లతో సమన్వయం చేసుకుని మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ సౌకర్యాలు, తేమ పరీక్షలు, గన్ని బ్యాగుల సరఫరా వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అంబాదాస్ రాజేశ్వర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, పిడి డిఆర్డిఏ జ్యోతి, జిల్లా సహకార శాఖ కిరణ్ కుమార్, ఏ సి ఎస్ ఓ రాజేశ్వర్ , డిపిఎం లు, ఏపీఎంలు, ప్యాక్స్ సెక్రటరీ లు , అధికారులు పాల్గొన్నారు.

# దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలి

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ డిమాండ్

మధ్యాహ్న భోజన విరామ సమయంలో అధికారులకు వినతిపత్రాలు

సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం..

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ రోజు తెలంగాణ ఎంప్లాయిస్ టీచర్స్ ఒ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈ జేఏసీ) పిలుపులో భాగంగా మునిపల్లి మండలం ఏ. రంగారావు ...తహసీల్దార్ గారికి వినతిపత్రం అందించడం జరిగిందని జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా టీజీఈజేఏసీ ప్రకటించిన కార్యచరణలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో స్థానిక తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పించిన అనంతరం వారు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని కోరారు. టీజీఈ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి , సెక్రటరీ జనరల్ ఏొడ్నాల రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్ళిన అనేక సమస్యలలో కొన్ని సమస్యలు పరిష్కారమైనప్పటికీ ఇంకా అనేక సమస్యలు, నేటికి పెండింగ్‌లోనే ఉన్నాయని అవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని వివిధ రూపాలలో సీఎస్, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని వారు కోరారు. జూన్ 2వ తేదీ నాటికి ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించాలని తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ మండల ప్రతినిధులు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ కార్యాచరణ ఉంటుందన్నారు. 2026 జూన్ 2వ తేదీ నాటికి పీఆర్సీ అమలుతో పాటు పెండింగులో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్స్ అన్నీ క్లియర్ చేయాలని, అలాగే రిటైర్డ్ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డ్స్ జారీ చేసి తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానంను పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు నోటిఫికేషన్ వేసి తర్వాత నియామకమైన ఉద్యోగులకు వెంటనే ఓపీఎస్ విధానమును అమలు చేయాలని కోరారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల వారసుల ఉద్యోగ నియామక సమస్యను సత్వరం పరిష్కరించాలని కోరారు. అలాగే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. త్వరలో జనాభా లెక్కల కార్యక్రమం ఉన్నందున ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సాధారణ బదిలీలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి మండల వివిధ సంఘాలకు చెందిన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎమ్మార్వో సిబ్బంది తపస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## జమాతే ఇస్లామీ హింద్ భద్రాచలం శాఖ ఆధ్వర్యంలో. చలివేంద్రాలు ప్రారంభం



అక్షర కలం / భద్రాచలం

భద్రాద్రి లో భానుడి భగభగ తో రోజు రోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్టిలో పెట్టుకొని రోడ్డు పైన పయనిస్తున్నబాటసారులు,ప్రయాణికులు,విద్యార్థుల దాహార్తినితీర్చాలనీ చల్లని మంచి నీటిని అందించాలనే సంకల్పించుకొని శుక్రవారం నాడు జమాతే ఇస్లామీ హింద్ భద్రాచలం శాఖ ఆధ్వర్యంలో భద్రాచలం లోని స్థానిక ఇండస్ట్రియల్ ఏరియా మరియు చర్ల రోడ్ మదీనా వుడ్ వర్క్ ముందు రెండు చలివేంద్రాలని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిందా,జామా మసీదు ప్రధాన కార్యదర్శి సలీం,చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసికార్యక్రమాన్నిప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మత పెద్దలు మునాఫ్, మాట్లాడుతు ప్రవక్త వారి బోధనలకు అనుగుణంగా నీటిని దానం చేయడం ఇస్లాంలో అత్యంత శ్రేష్టమైనదానంగాపరిగణించబడుతుంది. దాహంతో ఉన్న ప్రాణికి నీరు ఇవ్వడంవల్లసృష్టికర్తఅయినటువంటి అల్లా మన పాపాల్ని క్షమిస్తాడు, ఇస్లాంలో నీటి ప్రాముఖ్యత గురించి చెప్పడం జరిగింది.మీరు పారే నది ఒడ్డున కూర్చుని ఉన్నా సరే నీటిని వృధా చేయకండి అని చెప్పడం జరిగింది.అలాగే జామీ మజీద్ అధ్యక్షులు షఫీ, మాట్లాడుతు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో ముందుండి నడిపిస్తున్న ముస్లిం యువతకి ముందుగా శుభాకాంక్షలు తెలియపరుస్తూ ఈ వారంలో కాలేజీ సెంటర్.బ్యాంకు రోడ్డు.జామి మజీద్ నందు మరో మూడు చలివేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మానవత్వానికి ముందడుగు సహాయానికి సంసిద్ధం సంస్థ అధ్యక్షులు వజీర్,కోశాధికారి జావిద్,మీడియా సెక్రటరీ బాబాజీ, మరియు మునాఫ్,అబ్దుల్ రెహమాన్,జానీ,ముజీబ్,మౌలాలి. మదర్ ఇర్షాద్,గౌస్,ఆసిఫ్,జామి మసీద్ అధ్యక్షులు షఫీ,రబ్బన సర్వర్,జలీల్,ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

## కలివేరు గ్రామ ఆదివాసీ మహిళల పేరిట ఇసుక సొసైటీ నీ ఏర్పాటు చెయ్యాలి.ఇరప.రాజు దొర,

అక్షర కలం / భద్రాచలం



శుక్రవారంరోజునభద్రాచలంనియోజకవర్గంచర్లమండలంలోనికలివేరుగ్రామపంచాయతీలో గల ఆదివాసీ మహిళలపేరిటఇసుకసొసైటీఏర్పాటుచెయ్యాలనిఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఇరప.రాజు దొర డిమాండ్ చేశారు.కలివేరు గ్రామంలో ఆదివాసీ మహిళల పేరిట ఇసుక సొసైటీ ఏర్పాటు చేసి ఆదివాసీ మహిళలు, జీవనోపాధిపొందెలక్ష్యంతోతెలంగాణ రాష్ట్రప్రభుత్వంమహిళలకుఆర్థికంగా అండదండలు అందించాలని ఇందుకోసం గిరిజన సంక్షేమ శాఖ భద్రాచలం ఐటిడిఏ ద్వారా ప్రత్యేక నిధులు విడుదల చేయ్యలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం నుండి సరైన ఆర్థిక సహకారం ఇవ్వకపోతే ఆదివాసీ మహిళలు ప్రైవేట్ కాంట్రాక్టర్లను,బినామీలను బ్రోకర్ లను,గిరిజనేతరలను నమ్మి మోసపోవాల్సి వస్తోందన్నారు.ఈ విషయమై భద్రాచలం ఐటీడీఏ. పీవో.ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు.

## తాగు నీటి కోసం అల్లాడుతున్న ప్రజలు...

### నెలరోజులుగా మూతపడ్డ ఆర్వో ప్లాంట్.

### సింగరేణి, అధికారుల పనితీరుపై మండిపడుతున్న గ్రామస్తులు...

అక్షర కలం/ పినపాక.

వేసవి ఎండలు భగ్గుమంటున్న వేళ మణుగూరు మండలానికి చెందిన కొండాయిగూడెం గ్రామ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగరేణి యాజమాన్యం మరియు స్థానిక అధికారుల నిర్లక్ష్యం బహిర్గతమవు తోంది. ప్రజల దాహార్తిని తీర్చాల్సిన ఆర్వో ప్లాంట్ నెలరోజులుగా పనిచేయకపోవడం గ్రామస్తుల్లో తీవ్ర ఆగ్రహానికి దారి తీసింది. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సామాజిక బాధ్యతలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ తాగునీటి శుద్ధి కేంద్రం గంటకు 250 లీటర్ల నీటిని అందించే సామర్థ్యం కలిగి ఉన్నప్పటికీ, సాంకేతిక లోపాల పేరుతో నెల రోజులుగా మూతపడిపోయింది. దాదాపు 300 కుటుంబాలకు ఉపయోగపడే ఈ ప్లాంట్ మరమ్మతులు



లేక అలంకారప్రాయంగా మారడం గమనార్హం.ప్రజలు పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఎలాంటి స్పందన లేకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "సింగరేణి సంస్థ ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్న నిధులు నిజంగా ప్రజలకు ఉపయోగపడుతున్నాయా? లేక కేవలం కాగితాలపైనే పరిమితమ వుతున్నాయా?" అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నీటి కోసం మహిళలు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొనగా, రోజువారీ అవసరాలకే నీరు దొరకడం కష్టంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, సింగరేణి యాజమాన్యం స్పందించి తక్షణమే ఆర్వో ప్లాంట్‌ను మరమ్మతులు చేయాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన తాగునీటి సమస్యను ఇంతలా నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి..

## తెలంగాణపై అనుచిత వ్యాఖ్యలను పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించండి

### – లోక్‌సభ స్పీకర్‌కు ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి, తదితర ఎంపీల బృందం ఫిర్యాదు

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై భారతీయ జనతా పార్టీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ విభజన ప్రక్రియ భారత్–పాకిస్థాన్ విభజన కంటే దారుణంగా జరిగిందని ఆయన పోల్చడం పట్ల నిరసనగా.. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, కాంగ్రెస్ తెలంగాణ ఎంపీల బృందం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను శుక్రవారం కలిసింది. పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించాల్సిందే..తేజస్వి సూర్య చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను పార్లమెంటు రికార్డుల నుంచి వెంటనేతొలగించాలని,తెలంగాణ గౌరవానికి భంగం కలిగించినందుకు గాను కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీలు కోరారు. ఈ ఎంపీల బృందంలో : మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కడియం కావ్య, సురేష్ షెట్కర్, మరియు గడ్డం వంశీ ఉన్నారు.

## పాన్ షాప్ ప్రకాష్‌కు ఘన నివాళులర్పించిన ఇల్లందు జెకె వాకర్స్.

అక్షర కలం / ఇల్లెందు.



సౌమ్యుడు మంచి మనిషి వివాద రైహితుడుగా గత 40 సంవత్సరాలుగా ఇల్లందు పాత బస్టాండ్ సెంటర్లో పాన్ షాప్ ను నడుపుతూ మంచి పేరును పొందిన పాన్ షాప్ ప్రకాష్ జెకె బ్లూ డైమండ్ గ్రౌండ్లో వాకింగ్ చేస్తూ ఒక్కసారిగా కుప్ప కూలి మరణించడం విచారకరమని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన కుటుంబానికి భగవంతుడు అండగా ఉండాలని ఇల్లందు ప్రముఖ సీనియర్ న్యాయవాది దంతాల ఆనంద్, సమాజ హితుడు, సామాజికవేత్త డాక్టర్ సతీష్ ఖండిల్వాల్ పేర్కొన్నారు. శుక్రవారం జెకె బ్లూ డైమండ్ గ్రౌండ్లో జెకె వాకర్స్ రెండు నిమిషంలో మౌనం పాటించి ప్రకాష్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేరళ రాష్ట్రం నుండి పొట్టచేత పట్టుకొని 15 సంవత్సరాల వయసు లో బతుకుదెరువు కోసం ఇల్లెందు పాత బస్టాండ్ సెంటర్లో చంద్రం పాన్ షాప్ లో పనికి కుదిరాడని, అనంతరం స్వతహాగా పాత బస్టాండ్ లో పాన్ షాప్ పెట్టి ఇల్లందులోనే పెళ్లి చేసుకొని ఇద్దరు ఆడపిల్లల తండ్రి గ 40 సంవత్సరాల పాటు పాన్ షాప్ ను నడుపుతూ కస్టమర్ల అందరి చేత మంచి మనిషిగా మన్ననలను పొందాడని మంచి ఆరోగ్యంతో ఎలాంటి అనారోగ్యం లేని ప్రకాష్ భార్య సమేతంగా జెకె బ్లూ డైమండ్ గ్రౌండ్లో వాకింగ్ చేస్తు ఒక్కసారిగా కుప్పకూలి గుండె నొప్పితో మరణించాడని తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు ఆడ పిల్లలు వున్నారు. ఆడపిల్లలు ఒకరు డిగ్రీ ఫార్మసీ చివరి సంవత్సరం కాగా మరొకరు ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఖమ్మంలో చదువుతున్నారు. చనిపోయే రోజు ఇద్దరు కూతుర్లు ఖమ్మంలోనే ఉన్నారు. కిరాయి ఇంట్లో ఉన్న ప్రకాష్ పార్థివదేహాన్ని వాహనంలో కేరళకు తరలించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ప్రముఖ కాంగ్రెస్ నాయకులు సుదర్శన్ కోరి,సీనియర్ వాకర్లు యాదగిరి, విశ్వనాథ్, మహేష్, సతీష్,శివ నారాయణ,అప్పలరాజు, మల్లూరు శ్రీనివాస్, దాస్యం సురేంద్రబాబు తదితరులు ఘన నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## హిందూ సమ్మేళన కరపత్రాల విడుదల: - హిందూవుల ఐక్యతకు పిలుపు ;



(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,17)

నారాయణపేట జిల్లా కన్మనూరు ఉపమండలంలో హిందూ సమ్మేళనం ఊపందుకుంది. 21 ఏప్రిల్ 2026న సాయంత్రం 4:00 గంటలకు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం, ఎక్లాస్పూర్ గేట్‌లో భవ్యంగా నిర్వహించబోయే ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు శుక్రవారం హిందూ సమ్మేళన అధ్యక్షులు శ్రీ నరసింహ స్వామి , కార్యదర్శి, సభ్యులు కలిసి విడుదల చేశారు.విడుదల సందర్భంగా అధ్యక్షులు శ్రీ నరసింహ స్వామి మాట్లాడుతూ, "కన్మనూరు, ఎక్లాస్పూర్, జిన్నారం, చిత్తనూరు, బుడ్డగాని తాండల్లోని హిందూ బంధువులు అధిక సంఖ్యలో హాజరై, ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి. ఇది మన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడానికి, ఐక్యతను పెంపొందించడానికి ముఖ్యమైన అవకాశం" అని పేర్కొన్నారు. ముఖ్య వక్తగా శ్రీ మురళి మనోహర్ జీ పాల్గొంటున్నారని, ఆయన సువార్తలు భక్తులకు మార్గదర్శకంగా ఉంటాయని తెలిపారు.కరపత్రాల్లో పేర్కొన్నట్లుగా, భక్తులు కరపత్రం వెనుక వైపు "ఓం నమో భగవతే వాసుదేవాయ" మంత్రాన్ని 108 సార్లు వ్రాసి తీసుకురావాలి. ఈ మంత్రాలు యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి సన్నిధికి చేర్చబడతాయి. ఈ చర్య భక్తి సాధనలో పాల్గొనే అవకాశాన్ని అందిస్తుందని అధ్యక్షులు ప్రత్యేకంగా పేర్కొన్నారు.ఈ సమ్మేళనం భవిష్యత్ తరాలకు తోరణంలా నిలిచి, హిందూవులలో ఐక్యభావాన్ని చాటాలని, సామాజిక కార్యక్రమాలకు దారి తీసుకుంటుందని నరసింహ స్వామి గారు ఆకాంక్షించారు. ఉపమండలంలోని గ్రామాల నుంచి భక్తులు, యువత, మహిళలు అందరూ పాల్గొని విజయం సాధించాలని పిలుపునిచ్చారు. స్థానికంగా ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని రేకెత్తిస్తుందని అంచనా.

## నారాయణపేట జిల్లా వివో ఏలు: అందరూ ఒకే వేదికపైకి రండి..

### – ఐకెపి వివో ఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మారిపెల్లి మాధవి.

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,17)

నారాయణపేట, ఏప్రిల్ 17: శుక్రవారం జిల్లా కేంద్రంలో వివో ఏల ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీతో రాష్ట్ర కమిటీ ముఖాముఖి సమావేశం జిల్లా అధ్యక్షులు కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షురాలు మారిపెల్లి మాధవి పాల్గొని మాట్లాడారు. వివో ఏలతో రాష్ట్ర కమిటీ గత ప్రభుత్వంలో సాధించిన విషయాలు చర్చించారు. వారి సమస్యలు, డిమాండ్లు ముఖాముఖి అడిగి తెలుసుకున్నారు. నారాయణపేటలో అన్ని




మండల కమిటీలు ఏర్పాటు చేయాలని, జిల్లా కమిటీని పటిష్ఠం చేయాలని సూచించారు.ఇప్పుడు ఎస్ఆర్ఈపీ సీఈవో పరిధిలో పరిష్కరించిన అంశాలు, ప్రభుత్వం నుంచి ఇంకా సాధించాల్సిన అంశాలు చెప్పుతూ మాధవి నూతన ఉత్సాహం నింపారు. వేతనాలు ప్రభుత్వం పెంచకుండా జాప్యం జరిగినా, రాష్ట్ర కమిటీ ఏ కార్యక్రమం చేసినా ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉండాలని ఆహ్వానించారు.సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తిరుపతి, రాష్ట్ర కోశాధికారి నరసింహ, వర్కింగ్ ప్రెసిడెంట్ మొయినొద్దీన్, జిల్లా కార్యదర్శి గోపాల్, గౌరవ అధ్యక్షులు నర్సిములు, కోశాధికారి నరేష్, 5 మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులతోపాటు దాదాపు 150 మంది వివో ఏలు పాల్గొన్నారు.



## విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి:

### – రాష్ట్ర శిశు బాలిక సంరక్షణ కమిటీ చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డి ;





(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,17)

నారాయణపేట: విద్యార్థులు జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకొని, దాని సాధనకు అల్మటిగా కృషి చేయాలని రాష్ట్ర శిశు బాలిక సంరక్షణ కమిటీ చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డి సూచించారు. మరికల్ మండలంలోని కేజీబీవీ పాఠశాల, ధన్వాడ మండలంలోని దళిత బాలుర వసతి గృహం, ను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి, విద్యార్థుల అభ్యాస క్రమం, ఆహార సౌకర్యాలు, సౌకర్యాలపై ముఖ్యంగా చర్చించారు.పాఠశాలలో మిడ్–డే మీల్ (మధ్యాహ్న భోజనం) ప్రోగ్రామ్‌ను పరిశీలించిన సీతా దయాకర్ రెడ్డి, "విద్యార్థులకు అందించే భోజనం పోషకాహారం కలిగి, నాణ్యమైనదిగా ఉండాలి. ఎలాంటి లోపాలు లేకుండా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అమలు చేయాలి" అని పాఠశాల అధికారులకు సూచించారు. విద్యార్థులతో స్వయంగా మాట్లాడి, వారి అభ్యాస సమస్యలు, ఆరోగ్య సమస్యలు, ఇతర కష్టాల గురించి తెలుసుకున్నారు. బాల్య వివాహాలను గట్టిగా అరికట్టాలని హెచ్చరించారు. "పాఠశాల వయస్సులోని బాలికలు, వివాహాలకు గురవ్వకూడదు. ఇలాంటి సంఘటనలు గుర్తించబడితే తప్పనిసరిగా కమిటీకి సమాచారం ఇవ్వాలని సూచించారు.అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక టీకప్‌లు నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అపర్ణ, వందన గౌడ్, మరికల్ మండల తహసిల్దార్ రామకోటి, మండల ఆర్ ఐ సుధాకర్ రెడ్డి,మరికల్ మండల ఎంఈఓ కలీంముల్లా కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపల్ రాధిక, ఉపాధ్యాయులు, తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ తనిఖీలు జిల్లాలోని పాఠశాలల సౌకర్యాలను మెరుగుపరచడానికి, శిశు హక్కుల రక్షణకు దోహదపడతాయని స్థానికులు అంగీకరిస్తున్నారు.

## జూన్ 2 లోపు పీఆర్ సీ ప్రకటించాలి...టీజీఈజేఏసీ

### ఉద్యమిస్తేనే ఉపాధ్యాయ

### ఉద్యోగుల సమస్యలు పరిష్కారం...తపస్

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,17)

టీజీఈ జేఏసీ పిలుపు మేరకు ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మరికల్ తపస్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు సురేష్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం మరికల్ మండల తహసీల్దార్ రాంకోటి కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా తపస్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు సురేష్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగులు పెండింగ్ సమస్యలైన పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏల విడుదల, సీపీఎస్ రద్దు – ఓపీఎస్ అమలు, పెండింగ్ బకాయిల విడుదల, రిటైర్డ్ ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తప్పు పడుతూ పలు శాఖల ఎంప్లాయిస్ నిరసన తెలిపారు. జూన్ 2 లోపు పీఆర్సీ ప్రకటనతో పాటు ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించక పోతే పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమని తపస్ సంఘ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి నటరాజ్, జిల్లా కార్యదర్శి మఠం శివ శంకర్, సహా కార్యదర్శి రమేష్ కుమార్, మండల కోశాధికారి జ్ఞానేశ్వర్, గౌరవ అధ్యక్షుడు రాములు గౌడ్, మహిళా కన్వీనర్ జ్యోతి, జిల్లా బాధ్యులు చంద్రమౌళి, శీల సురేష్, చంద్ర శేఖర్, సుధీర్ కుమార్ ఇతర ఉపాధ్యాయులు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



# రేషన్ బియ్యం దందా సాగిస్తున్న ఆత్మకూరి జగదీష్ పై పీడీ యాక్ట్ అమలు:పోలీస్ కమిషనర్

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**



రేషన్ బియ్యాన్ని దారి మళ్లించి దుర్వినియోగానికి పాల్పడుతున్న ఆత్మకూరి జగదీష్ పై పీడీ యాక్ట్ అమలు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. పేదలకు ఉచితంగా అందాల్సిన బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, బయట రాష్ట్రాలకు తరలిస్తుండటంతో ఖమ్మం జిల్లాలో 13 కేసులు, సూర్యాపేట, వరంగల్ జిల్లాలో రెండు కేసుల్లో ప్రధాన నిందుతుడుగా వున్న ఖమ్మం నగరానికి చెందిన ఆత్మకూరి జగదీష్ పై శుక్రవారం పీడీ యాక్ట్ అమలు చేసి హైదరాబాద్ చంచలగూడ సెంట్రల్ జైలు తరలించడం జరిగిందన్నారు. దీర్ఘకాలికంగా బియ్యాన్ని బ్లాక్ మార్కెటింగ్ చేస్తూ, తరచూ పట్టుబడటంతో పీడీ యాక్ట్‌ను నమోదు చేసినట్లు తెలిపారు. పేదల కడుపు కొట్టే రేషన్ బియ్యం మాఫియాపై కఠిన చర్యలు తప్పవని అన్నారు.

# గండీడ్‌లో ఉద్యోగ-- ఉపాధ్యాయుల ఐక్య గర్జన

**డిమాండ్ల సాధనకై ఎమ్మార్వోకు వినతిపత్రం**



**గండీడ్, ఏప్రిల్ 17. అక్షర కలం :**

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం గండీడ్ మండలంలో ఐక్య కదలిక స్పష్టంగా కనిపించింది. తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు మండలంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు అన్ని సంఘాల నాయకులతో కలిసి ఎమ్మార్వో కార్యాలయానికి భారీగా తరలివచ్చి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్యాలయం పరిసరాలు నినాదాలతో మార్మోగాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని డిమాండ్లను ఆలస్యం చేయకుండా అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేతనాలు, పదోన్నతులు, బదిలీలు, సేవా నియమావళి వంటి కీలక అంశాలపై తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ప్రభుత్వ విధానాల వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం కొనసాగితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉద్యోగుల హక్కుల సాధనకై ఐక్యంగా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి నాయకులు కె.ఎం. చంద్రకాంత్, మండల నాయకులు వి. జనార్ధన్, జి. రాజేందర్ రెడ్డి, గంతా శ్రీనివాస్, జి. మహిపాల్ రెడ్డి, డి. సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు హాజరై ఐక్యతను చాటారు.

# వేగం బీభత్సం.. డివైడర్‌ను ఢీకొన్న కారు -- ముగ్గురికి తీవ్ర గాయాలు

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 17. అక్షర కలం**

: జిల్లాకేంద్రంలో వేగం మరోసారి ప్రాణాలపై ముప్పుగా మారింది. పట్టణంలోని ఎస్వీఎస్ ఆసుపత్రి సమీపంలో శుక్రవారం చోటుచేసుకున్న ఘోర రోడ్డుప్రమాదం కలకలం రేపింది. అతివేగంతో దూసుకొచ్చిన కారు అదుపుతప్పి రోడ్డుమధ్యనున్న డివైడర్‌ను బలంగా ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, వేగంగా వస్తున్న కారు ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయి డివైడర్‌పైకి ఎగబాకి బలంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన ప్రభావంతో కారు ముందుభాగం పూర్తిగా ఛిద్రమైపోయింది. ప్రమాద శబ్దంతో పరిసర ప్రాంతాల్లో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. స్థానికులు పరుగెత్తుకుంటూ వచ్చి గాయపడిన వారిని బయటకు తీసి వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమికంగా అతివేగమే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ, వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు.




# పార్లమెంటు సభ్యుడు సూర్యని సస్పెండ్ చేయాలి.

**అక్షర కలం / ఇల్లెందు**

నేడు జరిగిన పార్లమెంటు ప్రత్యేక సమావేశం సందర్భంగా మహిళా బిల్లుపై మాట్లాడకుండా తెలంగాణ విభజనను ఇండియా పాకిస్తాన్ విభజనతో పోల్చి రాజ్యాంగాన్ని నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలను అవగాహన రాహిత్యంతో అవమాన పర్చిన బిజెపి పార్లమెంటు సభ్యుడు తేజస్వి సూర్యను పార్లమెంట్ నుండి సస్పెండ్ చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి పార్లమెంటు సభ్యుడు తేజస్వి సూర్య తెలంగాణ అమరవీరుల త్యాగాలను అవహేళన చేయటమేనని ఈ మాటలను వెనక్కు తీసుకుంటూ బేషరుతు గా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని తెలంగాణ ఉద్యమ నాయకుడు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్ డిమాండ్ చేశారు.

# ప్రతి విద్యార్థి చదివే నైపుణ్యం సాధించాలి...

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

## ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ ద్వారా పఠనంలో గణనీయమైన పురోగతి

## ఉపాధ్యాయుల కృషి ఫలితం

## 29 వేల మంది విద్యార్థులకు పఠన నైపుణ్యాలు

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**






ప్రతి విద్యార్థి చదివే నైపుణ్యం సాధించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ముదిగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన "ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ సెలబ్రేషన్స్" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం పై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ముదిగొండ మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మమేకమై వారి పఠన నైపుణ్యాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు స్కిట్లు ప్రదర్శించడం, కథలు చదవడం, ఆత్మ విశ్వాసంతో పఠనం చేయడం వంటి కార్యక్రమాలు చూసి తాను ఎంతో ఆనందానికి లోనయ్యానని కలెక్టర్ తెలిపారు. "ఎఫ్రీ చైల్డ్ రీడ్స్" కార్యక్రమం ప్రారంభించిన ఉద్దేశ్యం నెరవేరుతోందని, సాధించిన పురోగతిపై సంతోషం వ్యక్తం చేశారు. చదవడం ఒక అత్యంత ముఖ్యమైన నైపుణ్యమని, చదవగలిగితే రాయడం, మాట్లాడడం సులభమవుతాయని అన్నారు. చదవలేని పిల్లలకు ఆత్మవిశ్వాసం తగ్గిపోతుందని, ఈ సమస్యను ప్రారంభ దశలోనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 29 వేల మంది విద్యార్థులు పఠన నైపుణ్యాలు సాధించారని తెలిపారు. ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని స్వంతంగా స్వీకరించి విజయవంతం చేయడం అభినందనీయమని, ప్రతి ఉపాధ్యాయునికి తన అభినందనలు తెలియజేశారు. ప్రారంభంలో కేవలం 12-13 శాతం మంది విద్యార్థులు మాత్రమే వాక్యాలు చదవగలిగితే, ప్రస్తుతం అది 84 శాతానికి పెరగడం ఉపాధ్యాయుల కృషి ఫలితమని తెలిపారు. మిగిలిన 16 శాతం మంది విద్యార్థులు కూడా పఠన నైపుణ్యాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. ప్రతి రోజూ ఒక గంట సమయం కేటాయిస్తూ పఠన నైపుణ్యాల పెంపుకు ఈ కార్యక్రమం అమలు చేస్తున్నామని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి మరింత ఉత్సాహంతో కార్యక్రమాన్ని కొనసాగించి, ఇండిపెండెన్స్ డే నాటికి 100 శాతం పఠన నైపుణ్యాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. వాక్యాలు చదవడమే కాకుండా, ప్రవాహంగా చదవడం, అర్థం చేసుకోవడం కూడా సమానంగా ముఖ్యమని అన్నారు. 3వ తరగతికి నిమిషానికి 30 పదాలు, 4వ తరగతికి 40 పదాలు, 5వ తరగతికి 50 పదాలు చదవగలిగే లక్ష్యాలను సాధించాలని సూచించారు. చదివిన విషయాన్ని అర్థం చేసుకునే సామర్థ్యం కూడా పెంపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేకంగా రూపొందించిన టిఎల్ఎం (ఁఘుఎష్ట్రఱఅస్త్ర ాాఘుతీఅఱఅస్త్ర ఖీఁవతీఱఘుశ్రీ) చాలా ఉపయోగకరంగా ఉందని, ముదిగొండలో నిర్వహించిన టిఎల్ఎం మేళా, పోటీలు ప్రశంసనీయమని తెలిపారు. బడి బాట కార్యక్రమంలో "ఎఫ్రీ చైల్డ్ రీడ్స్" వీడియోలను ప్రదర్శించి, ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు సంఖ్యను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమం కలెక్టర్‌గా తనకు అత్యంత సంతృప్తి ఇచ్చిందని, ఒకసారి పిల్లలు చదవడం ప్రారంభిస్తే వారికి ఇక ఎలాంటి అడ్డంకి ఉండదని తెలిపారు. ఆనతరం ప్రతిభ కనబడిన విద్యార్థులకు బహుమతులు, మెమెంటో, ప్రశంస ప్రతాలను కలెక్టర్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆగ్రహం

**హన్వాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్రిక్త నిరసన**



**హన్వాడ, ఏప్రిల్ 17. అక్షర కలం:**

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు శుక్రవారం హన్వాడ మండల కేంద్రంలో ఆందోళనకు దిగారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల సంయుక్త చర్యా కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు గుంపులుగా చేరుకుని ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గట్టిగా నినాదాలు చేశారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం అసహనానికి దారి తీస్తోందని హెచ్చరించారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే మరింత ఉద్ధృతంగా పోరాటం చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం టీజీఈజేఏసీ హన్వాడ మండల నాయకుల ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ సహాయకుడు కుమార్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యలను పైస్థాయికి చేరవేసి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిసింది. నిరసనలో పీఆర్టీయూ–టీఎస్ మండల అధ్యక్షులు స్వామి, విజయానంద రెడ్డి, కుర్మన్న, శ్రీహరి, శ్రీనివాస్, టీప్రార్టీయూ మండల అధ్యక్షులు పర్వతాలు, యాదయ్య, బీసీటీఏ ప్రతినిధులు రాఘవేందర్, మల్లేష్ పాల్గొన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులు జయప్రద దేవి, దశరథ రెడ్డి, రఘురామ్ గౌడ్, నర్సింహ రెడ్డి, శ్రీనివాసరావు, శైలజ, రవీందర్, రవి కుమార్, శ్రీనివాస్ తదితరులు భారీ సంఖ్యలో హాజరై నిరసనకు మద్దతు తెలిపారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు.

# అగ్నిమాపక వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్,,తెల్లం.వెంకట్రావు,



**అక్షర కలం / భద్రాచలం**

భద్రాచలం నిఖిత హాస్పిటల్ నందు అగ్నిమాపకవారోత్సవాలకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నిఖిత హాస్పిటల్ అధినేత మరియు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్,,తెల్లం.వెంకట్రావు,తెలంగాణ ఫైర్ రిజిస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ మరియు సివిల్ డిఫెన్స్ డిపార్ట్మెంట్ వారిఆధ్వర్యంలోఅగ్నిమాపకవారోత్సవాలు కార్యక్రమంజరుగుతున్నవి. దానిలో భాగంగా నిఖిత హాస్పిటల్ లోని డాక్టర్స్ మరియు స్టాఫ్ కి అగ్ని ప్రమాదం జరిగితే ఎమర్జెన్సీగా ఇలా రెస్పాన్స్అవ్వాలనేదానిపైఅవగాహన చేస్తు వారి సూచనలు సలహాలు పాటిస్తూ అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలోఅగి ్నమాపకసిబ్బంది,పార్టీనాయకులు,కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు,యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఇల్లందు మంచినీటి చెరువు నీటి అక్రమ వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటాం.

**మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, కమిషనర్ గణేష్.**

**అక్షర కలం / ఇల్లెందు.**



ఇల్లందు మంచినీటి చెరువు నీటి ని అక్రమంగా వినియోగిస్తున్న బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఇల్లెందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణమిత్ర డానియల్, మునిసిపల్ కమిషనర్ గణేష్ తీవ్రంగా హెచ్చరించారు. అక్రమ వినియోగంపై వచ్చిన వాట్సాప్ ఫిర్యాదులు ప్రత్యక్ష ఫిర్యాదుల మేరకు శుక్రవారం ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ మున్సిపల్ కమిషనర్ గణేష్ లు సంఘటన స్థలానికి వెళ్లి ప్రత్యక్షంగా సందర్శించి పరిశీలించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు, కాళీమాత తల్లి ఆలయ సమీపంలోని ఇల్లందులపాడు మంచినీటి చెరువులో జరుగుతున్న అక్రమ నీటి వినియోగంపై విశ్వాసనీయ సమాచారం మేరకు /సంబంధిత అధికారులకు /ప్రజాప్రతినిధులకు వచ్చిన వాట్సాప్ ఫిర్యాదుల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, ఇల్లందు మున్సిపల్ కమిషనర్ గణేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటనా స్థలాన్ని ప్రత్యక్షంగా సందర్శించి పరిశీలించిన వారు, చెరువు నీటిని అక్రమంగా మళ్లించడం, చెరువు సహజ ప్రవాహాన్ని దెబ్బతీసే విధంగా గండి కొట్టడం వంటి చర్యలను గట్టిగా తప్పు పట్టారు, ప్రజల అవసరాల కోసం ఉన్న మంచినీటి వనరులను వ్యక్తిగత లాభాల కోసం వినియోగించడం అసలు సహించబోమని హెచ్చరించారు. కమిషనర్ గణేష్ఇరిగేషన్ శాఖ సంబంధిత ఏ ఈ ఈ అధికారితో నేరుగా ఫోన్‌లో మాట్లాడి, ఈ అక్రమ నీటి వినియోగం, అక్రమ విద్యుత్ కనెక్షన్లపై తక్షణ విచారణ జరిపి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇకపై చెరువు నీటిపై ఎలాంటి అక్రమ జోక్యం జరిగినా, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. మంచినీటి చెరువుల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, ప్రజల ప్రయోజనాల పరిరక్షణ కోసం కఠినంగా వ్యవహరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, మున్సిపల్ కమిషనర్ గణేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏ ఇ నవీన్ , వర్క్ ఇన్స్పెక్టర్ నరసింహారావు , 1వ వార్డు కౌన్సిలర్ ఎస్.కె సైదమియా , సిహెచ్ రమేష్, కాంగ్రెస్ నాయకులు కొత్తపల్లి నవ తేజ, తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955